# మిసిమి

మాస పత్రిక

ఆగష్టు 1993

వెల రూ. 5/-





# మిసిమి

**"All that we are is the product of what we have thought,"**
**is "We are what we think." – Dammapada.**

సంపుటి 5 ఆగష్టు 1993 సంచిక 1

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక

భారతీయ తాత్విక పరిణామము – శివలింగం
ధోరణి – డా॥ సంజీవదేవ్
సాహిత్యంలో మౌలికత గురించి? – డా॥ ముకురాల రామిరెడ్డి
తనాటో ఫోబియా – వాసిరెడ్డి సీతాదేవి
తెలుగులో తాత్త్విక నవల – ఆర్.ఎస్. సుదర్శనం
ప్రేమించడం ఒక కళ – అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

విడిప్రతి రూ. 5/- వార్షిక చందా రూ. 60/-

ముఖచిత్రం

An Experiment on a Bird in the Air Pump
c.1767-68 72" x 96" Tate Gallery, London

*Wright's paintings of the contemporary scientific world are his most novel works, and this is justly the most famous of them. He shows totally convincingly the varied reactions to the experiment in which the bird loses consciousness as the air is sucked from the glass globe. There is remarkable tenderness in the portrayal of the two distressed girls, and the young couple on the left, who are evidently more interested in each other than in the experiment, are likewise beautifully observed. Sir Ellis Waterhouse, who wrote the standard history of British painting of Wright's period, described the painting as 'one of the wholly original masterpieces of British art'.*

# Scam is a Four-letter Word

LANGUAGE often plays interesting tricks on morality. The perception of an act of gross criminality, for instance, can be severely distorted by the words used to describe it. Deliberate linguistic parallax can so shift the enormity of an action as to make it appear innocuous.

Take the massive criminal fraud spanning securities and shares, brokers and bankers, bureaucrats and politicians, foreign banks and native public sector institutions, tax evasion and even narcotics trade. Take all the illegalities, all the immoralities, all the cynical manipulation of public resources, all the betrayal of trust. Take bribery. Take crookedness. Take unprofessional conduct. Take all these and try to take their sting away by finding a nice little innocuous and playful word - scam - to encapsulate them all.

The problem may lie in the fact that in the beginning there was no suitable word. 'Scam' does not figure in the 1980s editions of the *Concise Oxford Dictionary* or the Collins Essential English Dictionary or even the *Random House Dictionary of the English Language.* No problem. Look further afield. Look at America, where many such frauds have occurred. After all, if the economy is being globalised, so must its language. If such a word is not found even in proper American English, search through slang. The quest will be rewarding, for the word will take the sting out of the scandal.

Finally, it is found. The *Chambers English Dictionary, 1992,* lists it: "scam: skam (slang) n. a confidence trick, swindle (origin unknown)". Late editions of even the *Concise Oxford Dictionary* recognise it: "scam:/skam/n. U.S. slang/1. a trick or swindle; 2. a story or rumour (20th century; origin unknown)".

**ARVIND N. DAS**
in 'The Sunday Times of India'
July 25, 1993

## The deification of a bull

IN a strange inversion of Spain's favourite sport, it's the Bull that plays the piper here, while we poor picadors and matadors dance to his tune.

**– K.K. Pillai**

"He has the power of a godman. And there probably are some people who regard him as a reincarnation of God. After centuries of sacred cows, we now have a sacred bull... It is easier to believe one crook than to accept the fact that the country is run by hundreds of crooks".

**– K.K. Pillai**

# భారతీయ తాత్విక పరిణామము

## (అధ్యయనం)

**- శివలింగం**

మతం అనే పదాన్ని పదాలలోనో వాక్యాలలోనో బంధించి నిర్వచించడం కష్టం. మతం ఒక జీవన విధానం. సృష్టికర్తను గౌరవించడం విధేయతను ప్రకటించడంకూడా మతంలో భాగమే. **రెలిజియన్ ఆంగ్ల పదానికి మతము, ధర్మము** అనికూడా అర్థాలు చెపుతున్నారు. ప్రతి మతమూ విశ్వాసాలమీద సిద్ధాంతాలమీద ఆధారపడి వుంటుంది. మతం కొన్ని నైతిక సూత్రాలను రూపొంది స్తుంది. కర్మకాండలు, ఆరాధనా విధానాలు, ఆచారాలు, ఆహారం, దుస్తులు. ఈ విషయాల్లో మతం రూపొందించినవే, సజీవంగా అలాగే నిలిచివుంటాయి. అందుకే బుద్ధుడు యిప్పుడు పుట్టినా పెళ్ళిళ్ళల్లో జరిగే మంత్రాలు, కర్మకాండలను చూచి ఇది భారతదేశమని గుర్తించగలడు. యజ్ఞక ర్మలు ఆలోచనకు భిన్నం. వ్యక్తి ఆశలకు ఆశయాలకు ప్రతిబింబాలు. విశ్వాసం, యాగాలు, మతం. ఈమూడు కలసి ఒక తెగను ఏర్పరుస్తాయి. యజ్ఞాలు వాటి అర్థం కోల్పోయినప్పుడు విశ్వాసం సడలిపోతుంది. యజ్ఞం స్థానంలో భక్తి, మూఢసిద్ధాంతం పోయి ఆధ్యాత్మిక, ఆనందాన్వేషణ స్థానం ఆక్రమించాయి.

## వైదికమతం

ఈ భూమిలో ఎన్నో మతవిశ్వాసాలు పుట్టి, పెరిగి నశించాయి. వైదికమతం కర్మకాండమీద ఆధారపడింది. ప్రాథమిక దశలో వైదికమతం నిరాడంబరంగా వుండేది. గృహస్థులు గార్హపత్యాగ్ని వెలిగించడం, గాయత్రి పఠించడం చేసేవారు.

ఈగార్హపత్యాగ్ని మమ్ములను ఉద్ధరించి
సుకృత పరిపాకమైన స్వర్గలోకాన్ని అధిరోహింపజేయుగాక![1]

సామాజిక ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని చేసిన గార్హపత్యాగ్ని యజ్ఞయాగాదుల్లోకి మారిపోయింది. ఆడంబరాలు పెరిగిపోయాయి. సామాన్యుడు చేయలేని పరిస్థితికి చేరుకున్నాయి యజ్ఞయాగాలు. పెద్దనగారి వరూధిని చెప్పిన మాటలు నిజమే. యజ్ఞయాగాదాలు మాకవుగిల్లసుఖించటానికేనంటూ చెప్పినవి వైదిక మతక్షీణతకు కారణాలుగా గ్రహించవచ్చు. వేదమంత్రాలు, సూక్తాలు ఉచ్చరించడమే వైదికమతం అనే విశ్వాసం ప్రచారంలో వుంది. పూర్వమీమాంస రచయిత జైమిని ప్రకారం వైదికమతం యజ్ఞాలకు సంబంధించింది. వేదాలను రెండు భాగాలు చేశారు: మంత్రాలు బ్రాహ్మణాలు. యజ్ఞయా గాదుల విధులకు సంబంధిత మంత్రాలు సంహితల్లో వున్నాయి. భౌతిక సౌఖ్య సమృద్ధికొరకు తలపెట్టినవే ఈ యజ్ఞయాగాలు. మీమాంసకులకు సుదీర్ఘ సంప్రదాయం వుంది వారు చెప్పినదానికి ఆధారంగా. స్వార్థపరులు ఈ యజ్ఞాలద్వారా ప్రజల్ని దోచుకోవడం మొదలుపెట్టడం వలన యజ్ఞాలసంఖ్య పెరిగిపోతూ వచ్చింది. ఆడంబరాలు పెరిగాయి. యజ్ఞాలపట్ల నిరసనభావం ఆరంభమయింది. రెండు విద్యలున్నాయి. పర–అపర. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం. శిక్ష, కల్ప, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం - ఇవి తక్కువ

---

1. అథర్వవేద సంహిత 6-12-120 - అనువాదం విద్వాన్ విశ్వం

అంటే అపర విద్యకు సంబంధించినవి. యజ్ఞాలు ఓటి పడవలు. 18మంది తయారుచేశారు[1] వివేకభ్రష్టులు ఈకర్మలు చేస్తారు. వృద్ధ చాపల్యం, మరణాసన్నులు మాత్రమే అపరవిద్య ఉన్నతమైందనుకుంటారు. అని ముండకోపనిషత్తులో వుంది.

విద్య, అవిద్య రెండూ పరస్పర విరుద్ధాలు - **కఠోపనిషత్తు**

అదివేరు, నేనువేరు అనేవాడు మూర్ఖుడు. యజ్ఞపశువు - **బృహదారణ్యకం.**

తపస్సు, దానం, ఆర్జవం, అహింస, సత్యవచనం ఋత్విజులకు వరాలు - **ఛాందోగ్యం**

ప్రజాపతివ్రతం చేస్తే సంతానం కలుగుతుంది. బ్రహ్మచర్యం తపస్సుతో సాధించే బ్రహ్మలోకం ప్రాప్తిస్తుంది - **ప్రశ్నోపనిషత్తు.**

వేదయజ్ఞాలను వ్యతిరేకించిన విధానం పై ఉపనిషత్తులలో కనిపిస్తుంది. కాని వేదాలను ప్రామాణికములని అంగీకరించాయి. బ్రహ్మవిద్య శ్రోత్రియులకు (వేదాలను అభ్యసించినవారికి) మాత్రమే. బుద్ధి, జాడ్యజనితోన్మాదులుగదా శ్రోత్రియులు. ఉపనిషత్తులు భావసముచ్చయాలు. క్షణప్రభల వంటి అనుభూతులు. A system of Philosophy కనిపించదు. యజ్ఞకర్మలు చేస్తూవుంటే బ్రహ్మజ్ఞానం కలగదు. శంకరుడు కర్మలు వదిలాడు. వైదిక యజ్ఞకర్మల్ని గీత నిస్సందిగ్ధంగా ఖండించింది - (2,42-45). స్వార్థ ప్రయోజనాన్ని ఆశించి చేసే యజ్ఞాన్ని దూషించాడు, సామాజిక ప్రయోజనాన్ని కోరేవాటిని అనుమతించాడు గీతాకర్త. మహాభారత కాలానికి వైదిక యజ్ఞాలు మూలపడ్డాయి. అందుకు ఆర్థికపరిస్థితి కారణం. యజ్ఞాలు వ్యయంతో కూడుకొన్నవి. సామాన్యునికి అందుబాటులో లేనివి. పుణ్యంకోసం తీర్థయాత్రలు చేయమని సిఫారసు చేశారు. బ్రాహ్మణులకు దానం చేసినా పుణ్యం వస్తుందన్నారు. ఉపవాసాలు చేయమన్నారు. వేదాల్లో బ్రాహ్మణులకు దానం చేయమన్నారు యజ్ఞం చేసేటప్పుడు. ఇతిహాసాల్లో చెప్పిన దానంవేరు. విభిన్న దానాలు వాటి ఫలితాలు చెప్పారు. దానంకొద్దీ పుణ్యం. తీర్థయాత్రలు, ఉపవాసాలు, దానాలు అవైదికాలు. ఇవి ఆర్థిక పరిణామాలు. సమాజంలో మహాభారతకాలానికి రెండు వర్గాలు ఏర్పడినవి: ధనిక, పేద వర్గాలు. బ్రాహ్మణుల్లో దురాశ పెరిగి యజ్ఞాల నిర్వహణ వ్యయం విపరీతంగా పెంచగా పేద, మధ్యతరగతి ప్రజలకు భారమైపోయాయి. ధనికులుకూడా రాజసూయ, అశ్వమేధయాగాలు చేసే స్థితిలోలేరు. ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితులకనుగుణంగా వివిధ వర్గాలవారు వివిధ మతాచారాలను పాటించేవారు. వైదికమతం క్షీణించింది.

## వేదకాలానంతర మతాలు

శంకరుడు వచ్చేవరకు భగవద్గీతను అర్థం చేసుకున్నవారులేరు. దానికి ప్రాశస్త్యం లేదు. 9వ శతాబ్దారంభంలో శంకరుడు గీతాభాష్యం రాశాడు. ఆనాటికి బౌద్ధమతం మిణుకు మిణుకుమంటోంది. బౌద్ధానికి, హిందూ లేదా బ్రాహ్మణ మతానికి భేదంవుంది. బుద్ధుడు యజ్ఞయాగాదుల్ని ఏ రూపంలోను అంగీకరించలేదు. బౌద్ధంలోకి వైదికఛాయ పడనీయలేదు. కాని తరువాత మీమాంసకులు వైదిక మతాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. జైమినికి ముందు మీమాంసను గురించి ఆచార్య దయాకృష్ణవంటివారు శృతివ్యాఖ్యానంలో వున్న సమస్యల్ని చర్చిస్తున్నారు.[2] బుద్ధుని తరవాత ఒక శతాబ్దానికి జైమిని వచ్చాడు. 3వ శతాబ్దంలో శబరుడు, కొన్ని శతాబ్దాల అనంతరం

1. 16మంది ఋత్విజులు, యజ్ఞంచేసే దంపతులు. 4వేదాలు, 4 సంహితలు, 4 బ్రాహ్మణాలు, 6 వేదాంగాలు.
2. మీమాంస బిఫోర్ జైమిని - Some problems in the interpretation of Sruti in the Indian Tradition - **Dayakrishna JICPR Vol-IX-3.**

ప్రభాకరుడు, కుమారిలుడు. వైదిక మతయజ్ఞయాగాదుల పునరుద్ధరణ విషయంలో పూర్వమీమాంస విఫలం కాకతప్పలేదు. కుమారిలుడుగాని ప్రభాకరుడుకాని బౌద్ధంతో పోరాడి విఫల మనోరథుల య్యారు. ఆ ఖ్యాతి శంకరుడు (788-820)కి దక్కింది. అయితే ఆనాటికి బౌద్ధం కొనవూపిరితో వుంది. **బౌద్ధాన్ని పోగొట్టుకున్న భారతదేశం ధార్మికంగా ఆత్మహత్య చేసుకుంది. బౌద్ధం ఉన్నత ధార్మిక జీవనాన్ని ప్రబోధించింది. జ్ఞానోదయం అయినాక బుద్ధుడు లోకసేవ చేశాడు. ఇది నూతన ఆదర్శం. ప్రపంచ మతంగా రూపొందింది. సజీవ సందేశాన్నిచ్చింది. జనసామాన్యంలోకి తీసుకుపో డానికి బుద్ధుని విగ్రహారాధన మహాయానం ప్రవేశపెట్టింది. వేదమతంలాగ బౌద్ధమూ రూపొందింది. ఉన్నత శిఖరాలనధిరోహించిన బౌద్ధాన్ని కూలదోశారు. బౌద్ధ క్షీణదశలో యోగాచార తాంత్రిక క్షుద్రారాధనలు బయలుదేరి మతాన్ని మంటకలిపారు.** శంకరుడు చేసిన ఘనకార్యాల్లో ఒకటి మతాల స్థాపన. రెండు పంచాయతనపూజ. విష్ణు, శివ, శక్తుల పూజమొదలైంది. మనువు విగ్రహాలపేర్లు చెప్పలేదు. దేవలక బ్రాహ్మణులు పూజారులై వుండవచ్చు. వారు శ్రాద్ధకర్మల్లో పాల్గొనకూడదు. బ్రతుకుతెరువు కోసం అర్చన దైవమూర్తులు తయారుచేయకూడదు. గీతలో నాలుగుచేతుల విష్ణువు. బృహత్సంహితలో విష్ణువుకు ఎనిమిది లేక నాలుగు చేతులు. రొమ్ము మీద శ్రీవత్సముద్ర. కౌస్తుభం, పసుపుబట్టలు. చెవికి ఆభరణాలు. కుడిచేతిలో కత్తి, అభయముద్ర, బాణం. ఎడమచేతుల్లో శంఖం, చక్రం. మత్స్య పురాణంలో ఇంకా వివరాలు యిచ్చారు. సాలగ్రామ పూజ ప్రాచీనకాలంనుంచి వుంది. శంకరుని నుంచి మరీ వ్యాప్తిలోకి వచ్చింది.

## భాగవత మతం

వైష్ణవం ప్రాచీన కాలంలో లేదు. మహాభారతంలో ఒకచోట మాత్రం వుంది. పాఠ్యంలోలేదు. ఫలశ్రుతి అధ్యాయంలో వుంది. విష్ణువును ఆరాధించేవారిని భాగవతులనడానికి కారణం తెలియదు. ప్రాచీన భాగవతుడు హెలియొడొరస్. విదిశ (గ్వాలియర్) రాజు కాశీపుత్ర భగభద్రుని ఆస్థానంలో ఇండో బాక్ట్రియన్ రాజు ఆంటియల్ కిడాస్ రాయబారి. క్రీ.పూ. 5వ శతాబ్దం నాటికి విష్ణువు, కృష్ణుడు ఒకటిగానే గుర్తించారు. మహాభారతం, హరివంశం కథలు జనాల్లోకి చొచ్చుకుపోయాయి. పాణిని, పతంజలికి భాగవత సంప్రదాయం తెలుసు. గుప్తులకాలంలో బలమైన భాగవతుల తెగవుంది. సముద్రగుప్తుడు గరుడధ్వజ చిహ్నాన్ని స్వీకరించాడు. వైష్ణవులే చంద్రగుప్తుడు-II కాలానికి పరమభా వతులయ్యారు. రెండవ చంద్రగుప్తుని కూతురు ప్రభావతిగుప్తను వాకాటకరాజు రెండవ రుద్రసేనుడి కిచ్చి వివాహం చేశారు. దక్షిణాదికి వచ్చింది వైష్ణవం. రుద్రసేనుని పూర్వీకులు శైవులు. రుద్రసేనుడు చక్రపాణి (విష్ణు) భక్తుడుగా మారాడు. ప్రభావతి ప్రభావమే. ఆమె అత్యంత భగవద్భక్తురాలు. అనేకమంది రాజకుటుంబీకులు పరమ భాగవతులు. గుప్తుల కాలంలోనే అవతారాలను ఆరాధించారు. కాళిదాసు రఘువంశం దశమసర్గలో విష్ణువు దశరథపుత్రుడుగా జన్మించి రావణుని సంహరిస్తాడని చెప్పబడింది. మేఘదూత ప్రథమశ్లోకంలో **'జనక తనయాస్నాన పుణ్యోదకేషు'**. రామగిరి పుణ్య స్థలం. ఎందుకంటే సీత ఇక్కడ స్నానం చేసిందికనుక. తరువాత 50 పద్యంలో **'శార్ఙ్గిణో వర్ణచారే'** కృష్ణుని నీలవర్ణాన్ని దొంగిలించావని మబ్బుతో అంటాడు యక్షుడు. 53వ శ్లోకంలో బలరాముడు కురుక్షేత్ర సంగ్రామంలో పాల్గొనలేదని, తాగుడుకు అలవాటు పడ్డాడని, సరస్వతి నదికి యాత్రార్థం వెళ్ళాడని చెప్పాడు. ఈ విషయాలు మహాభారతంలో వున్నాయి.

మేఘదూతం 15వ శ్లోకం - **'బర్హేణేవ స్ఫురితరుచినా గోపవేషస్య విష్ణోః'** నెమలి పింఛం, గోపవేషం. కృష్ణుని బాల్యం గోపికలతో గడచిపోయింది. పల్లవరాజు విష్ణుగోపుడు (350-375) పేరుకూడా అదే తెలియచేస్తుంది. దామోదరపురం శాసనం బుద్ధగుప్తుడు **(AD475-500)** వేయించాడు. గుప్తులకాలంలో వరాహ అవతారం వ్యాప్తిలోనేవుంది. శ్వేతవరాహస్వామి, కోకాముఖ స్వామి - ఈరెండుపేర్లు వరాహ అవతారాన్ని తెలిపేవి. వీరి దేవాలయాలు హిమవచ్ఛిఖరంలో

వున్నాయి. నేపాల్‌లో కౌశికి కోకానదులు కలిసేచోట వరాహక్షేత్రంలో వున్నట్టు గుర్తించారు బెంగాల్ నుంచి యాత్రికులు.అక్కడచూచి ధీనాజ్‌పూర్ జిల్లాలో దామోదర్‌పూర్‌లో పైదేవుళ్ళను నెలకొల్పివుంటారు. బాదామి చాళుక్యులు వరాహం రాజచిహ్నంగా స్వీకరించారు. హూణరాజు తోరమణ (AD 500) శాసనంతోపాటు వరాహ విగ్రహం కూడా దొరికింది.

## పంచరాత్ర మతం

పంచరాత్రం శతపథ బ్రాహ్మణంలో వుంది. పంచరాత్ర అంటే అయిదు రోజుల యాగం. నారాయణుడు చేసినట్టు చెప్పబడింది. పంచరాత్ర పదం వరకే సంబంధం. పంచరాత్రం అవైదికం. విగ్రహారాధనను నొక్కిచెపుతున్నాయి పంచరాత్ర గ్రంథాలు. దీన్నే వ్యూహవాదం అన్నారు. సృష్టికిముందు వాసుదేవుడు. సంకర్షణ వ్యూహం (conditioned spirit). ప్రకృతి (సాంఖ్య ప్రకృతి). ఈరెంటి సంయోగంవలన ప్రద్యుమ్న వ్యూహం. మనస్సు (బుద్ధి - సాంఖ్యంలో). ఈ రెంటివల్ల అనిరుద్ధ వ్యూహం, అహంకారం. వీటివల్ల మహాభూతాలు తన్మాత్రలు.

జ్ఞానం, బలం, వీర్యం, ఐశ్వర్యం, శక్తి, తేజస్సు - ఈ ఆరుగుణాలు కలిగినవాడు వాసుదేవుడు. ఇది పంచరాత్ర సిద్ధాంతం.

వాసుదేవుడు - కృష్ణుడు. సంకర్షణుడు - బలరాముడు

ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు - కృష్ణుని కుమారులు.

ఈ పేర్లన్నీ మహాభారతంలో కనిపిస్తాయి. గీతలో వ్యూహవాదం లేదా పంచరాత్రం కనిపించదు. పురాణాల్లో పంచరాత్రీయానుయాయులు వున్నారు. వీరిని హేతువాదులుగాను, అవైదికులుగాను పేర్కొన్నాడు మేధాతిథి. బ్రాహ్మణుడు పంచరాత్ర మతం స్వీకరిస్తే వైదిక ఆచార క్రియలన్నీ పోగొట్టుకుంటాడని 13వ శతాబ్దంలోని వాడైన హేమాద్రి అన్నాడు వ్యూహపురాణం నుండి ఉదాహరిస్తూ. స్త్రీలను, శూద్రులను కూడా చేర్చుకున్నారు. ఉపదేశం యిచ్చారు. మూలం తెలియదు. పంచరాత్రమతం పాతదే. బౌద్ధ గ్రంథాల్లో వాసుదేవ, బలరాముల్ని ఆరాధించినవారున్నారు. అంగుత్తరనికాయంలో వివిధ మతాల జాబితా యిచ్చారు. భాగవతులు కనిపించరు. అశోకుని శాసనాల్లోనూ చేర్చలేదు. బౌద్ధం అనంతర కాలంలో మతం పాదుకొని వుండాలి. ఘసుండి (రాజస్థాన్) శాసనం (ఒకటవ శతాబ్దం క్రీ.పూ.)లో పూజా-శిలా-ప్రాకారో-నారాయణ-వాటిక అనివుంది.

శిలకు ప్రాకారం కట్టారంటే పూజ నిమిత్తమని అర్థమవుతుంది. భగవదాభ్యాం, సంకర్షణ వాసుదేవాభ్యాం అనడంవలన రెండుశిలలు (సాలగ్రామం) వాసుదేవుడు, సంకర్షణుడు ఇద్దర్నీ శిలలరూపంలో స్థాపించారు. వారిని అనిహతుడు, సర్వేశ్వరుడు అని పేర్కొన్నారు. శాతవాహనరాణి వేయించిన నానాఘట్ శాసనంలో వీరున్నారు. ధర్మ, ఇంద్ర, సంకర్షణ, వాసుదేవ, చంద్ర, సూర్య, యమ, వరణ, కుబేర, వాసవులను పేర్కొన్నారు.

పంచరాత్రం విగ్రహారాధన అభివృద్ధి చెందాక క్షీణించింది. వేదయాగాల స్థానంలో విగ్రహారాధన పంచరాత్రంనుండి కొత్త ఆచారక్రియల్ని ప్రవేశపెట్టారు. ఈవిషయం ప్రాచీన భారతీయ గ్రంథాల్లో కనిపించదు. 7,9,11 శతాబ్దాలనాటి కాంబోడియా శాసనాల్లో విష్ణు, శైవ ఆలయాల్లో పాంచరాత్ర ఆచారాలను అనుసరించేవారని పేర్కొన్నారు. వైష్ణవ దేవాలయాల్లో పూజాదికర్మలు పంచరాత్ర గ్రంథాలనుండి స్వీకరించినవే.[1]

**1. 3 సెప్టెంబరు 1714న జోధ్‌పూర్ మహారాజు అజితసింహుడు పంచాయతన పూజలో పేర్కొన్నవారు: హరి, అంబ, శివుడు, సూర్యుడు, వినాయకుడు.**

## వైష్ణవ మతం

వైష్ణవ పదం మహాభారతంలో లేదుగాని గుప్తుల తరవాత రాజులు ఉపయోగించారు. వైష్ణవం ఒక మత సిద్ధాంతంగా రూపొందించినవాడు రామానుజుడు (1010-1137). శ్రీవైష్ణవంకూడా ప్రాచీనమే. భక్తి పంచరాత్రం, వేదాంతం కలిపి ఒకే సంప్రదాయంగా రూపొందించిన ఘనత రామానుజుడిదే. 6వ శతాబ్దంనుండి 9వ శతాబ్దంవరకు ఆళ్వారులు తమిళదేశంలో వైష్ణవాన్ని సుసంపన్నం చేశారు. నాలాయిర ప్రబంధం 4000 గీతాలతో పన్రెండుమంది ఆళ్వారుల రచన. నాథముని మనుమడు యామునాచార్యుడు. 120 యేళ్లు బతికి 1038లో మరణించాడు. రామానుజుడు ప్రజల్ని వైష్ణవమతంలోకి మార్చగలిగాడు. బ్రహ్మసూత్రాలకు భాష్యం రాశాడు. వైష్ణవ వ్యాప్తికి ఎంతో కృషిచేశాడు. రామానుజుడు పూరి వెళ్ళినపుడు జగన్నాథ దేవాలయంలో పంచరాత్ర పద్ధతిని ప్రవేశపెట్టాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. వైష్ణవంలో మూడు సంప్రదాయాలు: నింబార్క, మధ్వ, వల్లభులు; వరసగా హంస, బ్రహ్మ, రుద్ర సంప్రదాయ వాదులు. గౌడీయ వైష్ణవం. మధ్వుని బ్రహ్మసంప్రదాయం. చైతన్యుడు రాధాకృష్ణ సంప్రదాయంతో మధురభావానికి ఆధ్యాత్మికతను జోడించి వైష్ణవానికి ఒకకొత్త ఉత్తేజాన్నిచ్చాడు. మధ్వుని భేదవాదానికి భిన్నంగా భేదాభేదవాదాన్ని ప్రబోధించాడు. వైష్ణవాన్ని నూతన జీవంతో నింపాడు చైతన్యుడు.

## రాధాకృష్ణ తత్వం

గౌడీయ వైష్ణవంలో రాధాకృష్ణ తత్వం ప్రధానంగా కనిపిస్తుంది. పారమార్థిక సత్యానికి వ్యావహారిక రూపమే రాధాకృష్ణులు. ఈప్రేమ క్రైస్తవంలోను, ఇస్లాంలోనువుంది. మత విశ్వాసాల్లో erotic symbolism సర్వసాధారణం. రాధాకృష్ణులు గ్రామీణ ప్రేమికులు (pastoral lovers). చైతన్యుడు రాధను హ్లాదినీశక్తిగా రూపొందించాడు. కృష్ణుడిమీద మహాభారతం, హరివంశం, విష్ణుపురాణం, భాగవత పురాణాలున్నాయి. హరివంశం మహాభారతంలోని భాగమే. పందొమ్మిదో పర్వమంటాడు వైద్యపండితుడు. కృష్ణుని తండ్రి వసుదేవుని పేరు భారతంలో చాలాసార్లు వస్తుంది. యుద్ధంలో యాదవులంతా చచ్చిపోయారు. కృష్ణుడు, బలరాముడుకూడా మరణించారు. వాసుదేవుడొక్కడే మిగిలాడు. యోగాంత్యేన తనుత్యజాం అన్నట్లు శరీరాన్ని విడిచాడు. కురుక్షేత్రంలో కృష్ణుడే శత్రుపక్షంలో వున్న యాదవుల్ని చంపమని ఉద్బోధించాడని కోశాంబి[1]. అంశుమతి (యమున) నదీ తీరంలో నవశించిన ఋగ్వేద కృష్ణుడు ఇంద్రునితో యుద్ధం చేశాడు. గిరిజన నాయకుడు (Tribal God). చారిత్రక కృష్ణుడు మహాభారతంలోనివాడు. శ్రీకృష్ణుని గురించి హరివంశం, పురాణాలు విపులంగా వర్ణించాయి.

రాసపదం ప్రథమంగా యోగవాసిష్ఠంలో కనిపించింది. వాత్స్యాయనుడి కామ సూత్రాల్లో హల్లీసక, రాసక పదాలున్నాయి. హల్లీసకం అంటే అర్థం ఈవిధంగా వుంది.

> మండలేన చయత్ స్త్రీనాం, నృత్తం హల్లీ సకంతు తత్
> నేతాతత్ర భవేద్ ఏకో, గోపస్త్రీనాం యథాహరిః

కామసూత్ర వ్యాఖ్యానం 13వ శతాబ్దానికి సంబంధించింది. రాసలీలకు అర్థం: పురుషుడు చుట్టూ స్త్రీలు నృత్యం చేయటం రాసలీల. గోపికలు హరిచుట్టూ నాట్యం చేస్తూ తిరిగినట్టు.

హేమచంద్రుని (1082-1149) అభిదాన చింతామణిలో హైశ్లోకంలోని మొదటి రెండు పాదాలు కనబడతాయి. దేశినామమాలలో హల్లీసకానికి మరోపేరు రాసకం పదం ఉపయోగించి దాని అర్థం 'మండలేన స్త్రీనాంనృత్తం' అన్నాడు. కృష్ణుని రాసలీల ప్రాచీనమే. కృష్ణునికి చరిత్రవుంది గాని రాధ అడ్రసులేని పిల్ల.

---

1. భగవద్గీత - చారిత్రకపరిణామం - డి.డి. కోశాంబి. హైదరాబాద్ బుక్ ట్రస్టు.

గాధాసప్తశతిలో రాధ కృష్ణునితో కనిపించింది. హాలునికాలం 3వ శతాబ్దం. హరివంశంకూడా ఇదేకాలంలో రాసిందే. తమిళంలో శిలప్పదికారంలో నప్పినై, రాధ ఒక్కరే అన్నారు. నప్పినై మాయావనుడు పెళ్ళి చేసుకున్నారు. దక్షిణ భారతంలో రాధాకృష్ణులు దంపతులు.

రాధ సంస్కృత సాహిత్యంలోకి ఎప్పుడు ప్రవేశించిందీ తెలియదు. భట్టనారాయణుని (700 AD) వేణీ సంహారంలో వుంది. రాధను ఆరాధించినట్టు సప్తశతిగాని గీతగోవిందంగానీ పేర్కోలేదు. ప్రాకృతంనుంచి వేణీ సంహారంలోకి ప్రవేశించివుంటుంది. సదుక్తి కర్ణామృతం (1179-1205) 11 శ్లోకాల్లో రాధ వుంది. రాధాకృష్ణుల ప్రేమ వర్ణితం. ఆదిలో రాధ జానపద దేవత. 15వ శతాబ్దంలో రాధా దామోదరులను ఆరాధించినట్టుగా గుజరాత్‌లో కుటుంబ దేవతలుగా వున్నారు. తరవాత పురాణాలు.

14-15 శతాబ్దాల్లో వైష్ణవకవులైన చండీదాస్, విద్యాపతి భక్తిగీతాలతో సాహిత్యానికి బలం చేకూర్చారు. చైతన్యుడికి ముందే బెంగాల్లో రాధాకృష్ణుల భక్తిసాహిత్యం పాదుకొనేవుంది.

చైతన్యునికి ముందు ఉన్నతవర్గీయులు బెంగాల్లో రాధను ఆరాధించలేదు. భక్తిసాహిత్యం రాధాకృష్ణుల పేరుతో పచ్చిశృంగారమయం చేశారు.

## అచింత్య భేదాభేదతత్వం

చారిత్రకంగా మాధ్వతత్వం అనీ అందుకే దీన్ని మాధ్వ గౌడీయ సంప్రదాయం అనీ అన్నారు. చైతన్యుడు పుస్తకాలు రాయలేదు. శిష్యుడైన రూపగోస్వామి, ఉజ్జ్వలనీలమణి, భక్తిరసామృత సింధు గ్రంథాలు రాశాడు. జీవగోస్వామి వ్యాఖ్యానాలు రాశాడు. బలదేవ విద్యాభూషణుడు బ్రహ్మసూత్రాల మీద గోవింద భాష్యం రాశాడు. భాగవతం ప్రామాణిక గ్రంథం. కృష్ణుడు సచ్చిదానందుడు. అంతరంగ స్వరూపశక్తి త్రివిధం. సంధినీ - సత్, సంవిత్ - చిత్, హ్లాదిని - ఆనందం. తటస్థశక్తి జీవాత్మగా అవతరిస్తుంది. జగత్తుగా మారడం మాయాశక్తి. జీవాత్మలు సూర్యుని నించి ప్రసరించే కిరణాల్లాగ భగవంతుని నుంచి వచ్చేవే. భక్తివల్లనే ముక్తి. భక్తి ద్వివిధం. విదిభక్తి - వేదాలు, శాస్త్రాలు చెప్పేది; రుచిభక్తి - ప్రేమ.

వేదాంతంలో ముఖ్యంగా మూడు విషయాలు గమనించాలి. పారమార్థిక సత్తా స్వభావం, జీవాత్మస్వభావం. జీవాత్మకు పరమాత్మకువున్న సంబంధం.

జీవాత్మ పరమాత్మ ఒక్కటేనన్నాడు శంకరుడు. ఆత్మ - పదార్థం పూర్తిగా ఈశ్వరునిమీద ఆధారపడినవేనని రామానుజుడు; జీవ, బ్రహ్మల భేదాన్ని అభేదాన్ని గుర్తించాడు నింబార్కుడు. మధ్వాచార్యులు ముక్తిపొందినా జీవబ్రహ్మల భేదం వుంటుందన్నాడు. భగవంతునికి దగ్గరవడమే గాని ఏకంకారు. అగ్నినుండి రవ్వలు వచ్చినట్టు జీవాత్మలు బ్రహ్మంనుండి వస్తాయని వల్లభుడు, జీవుడు ఆనందం అనుభవించేవాడేగాని ఆనందమయుడు కాలేదు. బ్రహ్మ ఆనందమయుడు. యిచ్చేవాడు పుచ్చుకునేవాడు ఒకడు ఎట్లా అవుతారు?

అచింత్యం తర్కాసహం యజ్ఞానం - శ్రీధరస్వామి

దుర్ఘట ఘటకత్వం హి అచింత్యత్వం - జీవగోస్వామి

16వ శతాబ్దం తరవాత అచింత్య భేదాభేదవాదం అనంతరం భారతదేశంలో తత్వ సంప్రదాయం వెలువడలేదు. ఉపనిషత్తుల ఏకత్వభావనమంచి మధ్వుడు ద్వైతం చేశాడు. ఉపనిషత్తుల సంప్రదాయాన్ని ధ్వంసం చేశాడు. విష్ణువును సర్వాధికార స్థానంలో నిలబెట్టారు.

శంకరునికున్న మేధాశక్తి (brilliant dialectic) తరవాత వచ్చిన రామానుజునికిగాని, మధ్వునికి గాని లేవు. చైతన్యుని అనంతరం దేశంలో తాత్విక సంప్రదాయం ప్రబోధించే అవకాశాలు లేవు.

★

# ధోరణి – VII

డా॥ సంజీవదేవ్

తెల్లవారలేదు, ఇంకా చాలా ప్రొద్దుంది. ఎందుకట్లా కలవరంగా లేచి కూర్చొని భయం భయంగా నా వైపు చూస్తూ నా చేయి పట్టుకుంటున్నావు గట్టిగా, మన పెళ్లి అయి ఇరవై సంవత్సరాలు కావచ్చింది, ఇంతవరకెన్నడూ ఇటువంటి వైఖరి చూడలేదు. నీ చేతి గాజులను కూడ పట్టుక చూస్తున్నావు.

మీరేమీ భయపడకుండా ఉంటే చెపుతాను. మీరు ధైర్యశాలులు, మీరు భయపడతారనే భయం నాకు లేదు. అదొక పీడ కల. అది మీకు చెప్పాలసిన కల కాదు. అయినా చెప్పక తప్పదు.

నన్ను వృథాగా కుతూహలపరచబోకు చాలా సేపు. అదేమిటో త్వరలో చెప్పి వేయి.

చెపుతా వినండి, నేను విధవనయి ముసుకు కప్పుక కూచున్నట్లు వచ్చింది ఆకల. బంధువులంతా చుట్టూ కూర్చొని దుఃఖిస్తున్నారు. వారి మధ్య మీరు కూడా కూచొని నా తలమీద చేయివేసి నవరిస్తూ మిగతా వారికంటే ఎక్కువగా విలపిస్తున్నారు. మీరు నా ముఖంలో ముఖంపెట్టి అంటున్నారు: ''నీవు ఇంత త్వరలో విధవవైపోతావని నేనూహించి ఎరుగను, నీకు సంభవించిన ఈ దుస్థితిని చూచి నేనే విధంగా భరించగలను? మన పెళ్లిఅయిన ఇరవై సంవత్సరాల్లో నీవెన్నడూ విధవ అయి ఎరుగవు. ఇదే మొదటిసారి నిన్ను విధవగా చూడటం''. ఆ మాటలంటూ మీరు నా దగ్గరనుంచి లేచి వెళ్లటం జరిగింది. లేవవద్దు, లేవవద్దు అంటూ నేను మేల్కొనటం జరిగింది. కలలోని స్థితి నిజమా, మేల్కొన్న స్థితి నిజమా అని నా చేతి గాజులమీద చేయివేసి చూస్తే అవి చేతికే ఉన్నాయి. మెడలో మాంగళ్యం ఉన్నదో లేదో అని చూస్తే మాంగళ్యం మెడలోనే ఉన్నది. మీరు నా ప్రక్కన పడుకొని ఉన్నారా లేదా అని చూస్తే మీరు నా ప్రక్కన పడుకొనే ఉన్నారు. నేను విధవను కాదని తెలిపే ఇన్ని సాక్ష్యాధారాలు కనిపిస్తున్నప్పుడు నేను విధవను ఎట్లా అవుతాను? నేను విధవను కాను అని తెలిసిపోయింది. ఇక భయం లేదు. నిర్భయంగా ఆనందంగా మీ హృదయంలోకి తలదూర్చి తెల్లవారే వరకూ పడుకొంటాను.

ఇదా విషయం? బాగుంది. అన్నిటికంటే బాగుంది విధవ అయిన నీ దగ్గర నీ భర్త కూచొని దుఃఖించటం! భర్త ఉన్న విధవలు వాస్తవ జగత్తులో ఉండరు కాని స్వప్న జగత్తులో ఉంటారని తెలిసిపోయింది.

సరేకాని నాదొక చిన్న సందేహం ఉన్నది, తీరుస్తారూ? భర్తలేని భార్య ఎక్కువ బాధలో ఉంటుందా, భార్యలేని భర్త ఎక్కువ బాధలో ఉంటాడా అని.

ఏమి ప్రశ్న ఇది? నా దృష్టిలో ఇది విశేష ప్రశ్న ఏమీ కాదు. భర్తమీద ప్రీతి ఎక్కువగా ఉంటే భర్తలేని భార్య ఎక్కువ బాధలో ఉంటుంది, భార్యమీది ప్రీతి ఎక్కువగా ఉంటే భార్యలేని భర్త ఎక్కువ బాధలో ఉంటాడు. ఎవరిమీదా ఎవరికీ ప్రీతి ఎక్కువగా లేకపోతే ఉభయులూ ఎక్కువ బాధలో ఉండరు. ఈ విషయాన్ని గురించి ఎక్కువ ఆలోచించాలసిన అవసరం లేదు. ఇది అందరెరిగిన సామాన్య సత్యమే.

అవును మీరు వెలిబుచ్చిన అభిప్రాయంలో లోపం ఏమీ లేదు. కాని దానితోపాటు నాదొక చిన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తపరచాలసి ఉంటుంది. మీరు పురుషులైనప్పటికీ స్త్రీ అయిన మీ పత్ని అభిప్రాయాన్ని నిర్లక్ష్యపరచరని నమ్ముతాను.

ఇందులో స్త్రీ పురుషుల అభిప్రాయాల విలువలను కాక హేతుబద్ధమైన దానికి మాత్రమే ప్రాధాన్యమిద్దాం. కనుక నీ వాదన ఏదో కొనసాగించు.

నా వాదన ఏమంటే భార్య మరణించిన భర్త కంటే భర్త మరణించిన భార్యయే ఎక్కువ బాధపడుతుందని. ఇందుకు ప్రధాన కారణం ఏమంటే భర్త మరణించిన భార్య మళ్లీ పెళ్లిచేసుకోటం జరుగదు, భార్య మరణించిన భర్త మళ్ళీ మళ్లీ కూడ పెళ్లి చేసుకోటం జరుగుతుంది కనుక. అటువంటప్పుడు భార్య బాధ ఎక్కువ బరువుగా ఉండక భర్త బాధ ఎక్కువగా ఉంటుందా?

నీ వాదన బే సబబుగా లేదు. కాని ఈశ్వర చంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం మొదలైన మహామహుల సంస్కార కార్యక్రమాల ద్వారా విధవలు కూడ మళ్ళీ పెళ్లిళ్లు చేసుకుంటున్నారు కనుక నీవు చెప్పిన కారణం కూడ సరిపోదు.

విధవా వివాహాలు వాడుకలో ఉన్నాయని అనటమే కాని నూటికో కోటికో తప్ప అవి జరగటం లేదు. సంస్కార కుటుంబాల్లో కూడ విధవా వివాహాలు విరివిగా జరగటం లేదు. అందువల్ల భర్తల మరణాలవల్ల భార్యలు బాధపడేంత ఎక్కువగా భార్యల మరణాల వల్ల భర్తలు అంతగా బాధపడటం లేదు.

ఎవరు బాధపడినా బాధపడకపోయినా మనదేశంలో స్త్రీ పురుషుల్లోని భేదాలు భేదాలుగానే ఉండిపోతున్నాయి. ఈ భేదాలు నశించనంతవరకు సమసమాజ స్థాపన ఒక అందని ఆదర్శంగా మాత్రమే మిగిలిపోతుంది.

నిజమే ''యత్రనార్యాస్తు పూజ్యంతే ర మంతే తత్ర దేవతాః'' స్త్రీలు పూజించబడే చోట దేవతలు సంచరిస్తారట. అటువంటి భారతదేశంలో స్త్రీల స్థితి సుస్థితిగా మారక దుస్థితిగా మారుతుండటం శోచనీయం కంటే మించిన శోచనీయ విషయం. ఇక విధవల దైన్యాన్ని గురించి చెప్పే అవసరం లేదు. ఎవరైనా ప్రయాణమై వెళుతూ వాకిట్లోకి రాగానే ఎవరైనా విధవ ఎదురుపడితే ఆ పూటకు ప్రయాణం ఆపుకోటం జరుగుతుంది. విధవా రూపంలో ఉన్న స్త్రీ అశుభానికి మూర్తిమతి అట.

సృష్టిలో తల్లికున్న ప్రాధాన్యం తండ్రికి లేదు. గర్భస్థ శిశువు నెలలు నెలలుగా తల్లి కడుపులో పెరుగుతుంది కాని తండ్రి కడుపులో కాదు. పుట్టిన శిశువు తల్లి పాలు త్రాగి జీవిస్తుంది కాని తండ్రి పాలు త్రాగి కాదు. శిశువు అమ్మ దగ్గర పెరుగుతుంది కాని అయ్య దగ్గర కాదు. శరీరానికి కాని మనసుకి కాని బాధ కలిగినప్పుడు అమ్మ అని ఉచ్చరిస్తుంది కాని అయ్య అని కాదు.

అవన్నీ నిజమే. మరో విషయం చెపుతాను. నేను పురుషుడనైనా కూడ పక్షపాతం లేకుండా చెపుతాను ఆ విషయం. అది మన నిత్యజీవితంలో చూస్తున్న గొప్ప అసామ్యం. అదేమంటే భార్య తన భర్తను ''మీరు'' అని పిలవటం, భర్త తన భార్యను నీవు అని పిలవటం చాలా హీనమైన ఆచారం. కొన్ని అగ్రవర్ణ కుటుంబాల్లో కూడ భార్యను 'నీవు' అని మాత్రమే కాక ''ఏమే'' అనటం కూడ వాడుకలో ఉన్నది. ఇంతకంటే హీనమైన చర్య, నీచమైన సామాజిక ప్రథ ఏముంటుంది మానవ జీవితంలో? ఇంతకంటే దిగజారిన మానవత మరేముంటుంది?

మీరు భలే అన్నారండి పురుషులై ఉండి కూడ. నేను స్త్రీని అయి ఉండి కూడ స్త్రీల పక్షాన ఆ మాత్రం మాట్లాడలేక పోయాను. ఇక నుంచి నన్ను 'మీరు' అంటారా? వద్దు లేండి.

ఇక అంతే కాదు, మరో విషయాన్ని గురించి కూడ స్త్రీల పక్షం పలుకుతాను. భర్త చచ్చిపోయిన స్త్రీకి భర్త కట్టిన మాంగళ్యాన్ని తీసివేయటం అవసరమో కాదో తెలియదు కాని పెళ్లికంటే

ముందునుంచే ఉన్న చేతి గాజులు, నొసటి బొట్టు తీసివేయటం మాత్రం ఘోరమైన అన్యాయం. ఇదంతా కూడ పురుషుడు ఏర్పరచిన స్వార్థం; వట్టి స్వార్థం కూడా కాదు, పచ్చి స్వార్థం. భార్య చనిపోతే ఆమె మీది సామానంతా తీసివేయవచ్చు కాని భర్త చనిపోతే భార్యను ఆ విధంగా చేయటం ఏ మాత్రం సమర్థనీయం కాదు. నేను చచ్చిపోయిన తరువాత మీరు విధవగా మారవద్దు.

మీరు పురుషులై ఉండి కూడ స్త్రీల విషయంలో జరగాలసిన సంస్కారాలను సమర్థించారు సంతోషం. కాని విచిత్ర మేమంటే స్త్రీల సంస్కారాల అమలుకు శత్రువులు పురుషులు కారు, స్త్రీలే. చాలామంది స్త్రీలు ఈ మార్పులను వ్యతిరేకించటంలోనే తమ పవిత్రమైన పాతివ్రత్యం ఇమిడి ఉన్నదని భ్రమ చెందుతారు. స్త్రీల ప్రగతికి అడ్డుపడేది పురుషులకంటే స్త్రీలే ఎక్కువ అని.

సరే, నేటికి ఈ వాదవివాదాలను ఇంతటితో ఆపి మన దైనందిన కార్యక్రమాలను సాగించటం ప్రారంభించుదాం. మనం ఇంతవరకు జరిపిన చర్చలు మొదలైనవి దైనందిన కార్యక్రమాలు, కావా? దైనందిన కార్యక్రమాలు అని వేరే ఉంటాయా అని మీరనవచ్చు. అది భావార్థంలో నిజమే కాని వ్యావహారికార్థంలో వేరుగా ఉంటుంది. భావార్థం వేరనీ, వ్యావహారికార్థం వేరనీ మీరు అంగీకరించనంటే ఇక నేను చెప్పేదే లేదు. తాడిచెట్టూ కొబ్బరిచెట్టూ స్థూలాకృతిలో సారూప్యాన్ని కలిగి ఉంటాయి. భేదం ఆకుల్లోను కాయల్లోను మాత్రమే ఎక్కువ గోచరిస్తుంది. ఆ స్థూల సారూప్యం వల్ల ఆ రెండూ ఒకటవుతాయా? కొబ్బరిచెట్టు కొబ్బరి చెట్టే, తాడిచెట్టు తాడిచెట్టే. ఇవన్నీ మీ ఎదట నా తెలివిని ప్రదర్శించటానికి చెప్పే మాటలు కాదు, యథార్థం కనుక చెప్పేను.

ఆపమ్మా ఆపండి అంతటితో. మీ తర్క విద్యకు నాకు నవ్వు వస్తుంది. నవ్వు వచ్చినా నవ్వను. ఇటువంటి వాదవివాదాల్లో ఒకళ్లకు నవ్వు వస్తే రెండో వాళ్లకు కూడ నవ్వు రావాలి. కాని నవ్వుకు బదులు ఏడ్పు వస్తుంది. నిజంగా ఇప్పుడు నేను నవ్వటం జరిగితే మీరు ఏడవటం జరుగుతుం దమ్మా, కనుక ఇప్పుడు మీచేత ఏడ్పించకుండా ఉండాలంటే నేను నవ్వకుండా ఉండాలి. అయితే ఇందులో మరో తిరుగుడు కూడా ఉంటుంది. నా నవ్వుకు మీరు ఏడిస్తే మీ ఏడ్పుకు తిరిగి నేను నవ్వాలసి ఉంటుంది. ఈ పద్ధతిని నెగెటివ్ రియాక్షన్సు అనవచ్చు. ఇక చాలు, స్నానం చేస్తాను, మీరు కూడ చేయండి. ఇద్దరం ఒకేసారి స్నానం చేద్దాం అంటే నా ఆటంకం ఏమీ లేదు. అయితే అందులోని చిక్కు ఏమంటే ఇద్దరం ఒకేసారి స్నానం చేసే వసతి మన ఇంట లేదు. నదిలో అయితే, ఇద్దరమే కాదు, పది ఇద్దరమైనా హాయిగా చేయవచ్చు. మరి అది ఇంటివద్ద కుదరదు.

ఆపండి ఇక మీ స్నాన విజ్ఞానమంతా. మీ ధోరణి చూస్తే ఆకలివేసినందున మాట్లాడే మాటలుగా ఉన్నాయి. అటువంటప్పుడు స్నానానంతరం ఏమైనా తినే బదులు స్నానాత్పూర్వమే ఏమైనా తిని తరువాతే స్నానం చేయవచ్చుగా. అయినా, ఏమి మాటలవి? వయసు ముదురుతున్న కొద్దీ దానితోపాటు మీలో శృంగారానుభూతి కూడ ముదురుతున్నట్లుంది. మీరన్న మాటలకు మీకే నవ్వువస్తున్నట్లుంది. మరి నవ్వు రాక ఏమొస్తుంది. ఒకరు తాను మాట్లాడిన చమత్కారానికి ఇతర్లు నవ్వనప్పుడు తానే స్వయంగా నవ్వుకొంటాడు.

ఆపమ్మా భారత నారీ మర్యాదంతా మీలోనే మేల్కొని ఉన్నట్లుంది. నేను మాటన్నానే కాని మీతో కలిసి స్నానం చేశానా ఏమన్నానా? మీకు ఆ మాటకే అంత తప్పు అయిందా. సరే, నాకు అర్థం అయింది. ఇక నేటి రాత్రినుంచి చెరొక గదిలో శయనిద్దాం. పిల్లలిద్దరినీ వేరే గదిలో.

అదేమిటండీ, మీ మానసిక ఆరోగ్యం ఏమైనా అనారోగ్యంలోకి ప్రవేశించ సాగిందా ఏమి? నేనొకటంటే టకాటకామంటూ మీరు పది పెట్టేరు. చెరొక గదిలో పడుకుందామని బెదిరిస్తారేమిటి. ఆ విధంగా నేను పడుకోలేననా మీ భావన? ఏకాంతంగా నేను పోగలను నిద్ర, మీరే పోలేరు. వేరే

వేరే గదుల దాకా ఎందుకు, వేరే వేరే మంచాల మీదనే మీరు నిద్ర పోలేరు. నా దేహాన్ని నా మనస్సు నడుపుతుంది, మీ మనస్సును మీ దేహం నడుపుతుంది. నేను వియోగాన్ని అందరివలెనే ఆనందించ లేను కాని అందరికంటే ఎక్కువగా భరించగలను. అది మీవల్ల కాదు. అది మీవల్ల కానందుకు నేను విచారించటం లేదు, ఆనందిస్తున్నాను. ఇప్పుడు మాత్రమే కాదు. ఇకముందు కూడ వియోగాన్ని భరించే బలహీనత మీలో ప్రవేశించకుండా ఉండాలని కోరే బలం నాలో క్షణ క్షణం పెరగాలని నాకాంక్ష, నా ఆకాంక్ష. ఆ బలహీనత మీలో ఉన్నందువల్లనే మీరంటే నాకంత ప్రీతి, నాకంత తీపి.

ఎంత లోతయిన విషయాలు చెప్పగలిగేవు. అవన్నీ నాకు తెలియని విషయాలు కావు కాని నీవు వాటిని చెపుతుంటే మాత్రం అనిపించింది అవన్నీ నాకు తెలియని విషయాలని. ఒకటి జ్ఞాపకం వస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. మనకు పెళ్లిఅయిన కొత్తలో వియోగాలని సంతోషంతో కాకపోయినా బాధతో అయినా సహించకలిగేవాళ్లం, కాని ఇప్పుడు వియోగాన్ని బాధతో కూడా సహించలేక పోతున్నాం. ఎందులో ఉన్నదీ భేదం?

నన్ను చెప్పమంటారా దానికి జవాబు? అప్పటి వియోగం సంయోగానికి పూర్తిగా విరుద్ధమైంది. వెలుగుకూ చీకటికీ, తీపికీ చేదుకు, గతికీ స్థితికీ ఎంత వైరుధ్యం ఉంటుందో అంత వైరుధ్యం ఉండేది. అవన్నీ కూడ నెగెటివ్ అపోజిషన్‌కు చెందితే ఇప్పటి మన సంయోగ వియోగాలు పాజిటివ్ అపోజిషన్‌కు చెందుతాయి. సమీపంలో సమీపం గోచరించటం సంయోగం. దూరంలో దూరం గోచరించటం వియోగం. కాని నిజమైన ప్రేమలో సమీపంలో దూరం కూడ గోచరించటం, దూరంలో సమీపం గోచరించటంవల్ల వియోగంలో సంయోగపు మాధురి, సంయోగంలో వియోగపు వేదన కూడ తట్ట సాగుతుంది. అంటే సంయోగానికి సామీప్యం మాత్రమే అవసరం లేదు, వియోగానికి దూరం మాత్రమే అవసరం లేదు. ఇందులో దగ్గర దూరాలు తమ తమ వ్యక్తిత్వాలను కోల్పోయి సమన్వయం చెందటం ప్రారంభిస్తాయి. అందువల్ల ఇప్పుడు సమీపంలో ఉన్నా కూడ అది వియోగంతో సంలగ్నమై ఉంటుంది. అంటే ఇప్పుడు సంయోగం మీద ఎంత ప్రీతి అంటే క్షణిక వియోగాన్ని కూడ సహించలేనంత ప్రీతి. నిరంతరం తెంపులేని సంయోగాన్ని కోరుతుంది మన చేతన. అందుకే వెనకటి వలె నేడు వియోగాన్ని సహించజాలం.

ఇన్ని సన్నిహిత విషయాలు మీలో అవ్యక్తంగా దాగిఉన్నట్లు నాకు తెలియదు, కొందరు పైకి సామాన్యులుగా కనపడుతూ లోపల కనపడని అసామాన్యులుంటారు. అందులోని వారేనమ్మా మీరు.

నన్ను అంత అసామాన్య జీవులలో లెక్కగట్టినందుకు మీకు నా హార్దిక ధన్యవాదాలు. నాకు మధ్య మధ్య మన వివాహం నాటి రోజులు, వివాహానికి ముందటి రోజులు, వివాహానంతరపు రోజులు గుర్తుకు వస్తుంటాయి. ఆ రోజులన్నిటిలోకీ వివాహం కాక ముందటిరోజు ఎక్కువ మధురానుభూతిని ఇచ్చింది.

అవును, ఆనాటి పిక్నిక్‌లో మనం కలుసుకున్నప్పుడు మొదటిసారిగా మనం ఉభయులం ఒకరి యెడల మరొకరం ఎంతో ఆకర్షితుల మయాం.

నిజమే, అయితే అది శారీరకాకర్షణా, లేక మానసిక ఆకర్షణా, లేక రెండిటి సంయుక్తాకర్షణా అనేది ఆ రోజుల్లో తెలిసేది కాదు. అది ఏ ఆకర్షణ అయిందీ తెలిస్తే ఆ ఆకర్షణలోని ఆకర్షణ చాలా నశించిపోయేది. దాన్ని గురించిన వివరణ తెలియక పోబట్టే మనలో ఆ ఆకర్షణ జ్వాల వెలుగుతుండేది. ప్రతి చూపూ ఎంతో సొంపుగా కనిపించేది; ప్రతి మాటా ఎంతో ఇంపుగా వినిపించేది, ప్రతిస్పర్శా ఎంతో కదిలించేదిగా ఉండేది. ఇవన్నీ ఉండి కూడా వాటిని అనుభవించే స్థితి ఉండేది కాదు. వీటన్నిటి వెలుగుల వెనకా ఒక దిగులుచీకటి తన నల్లపడిగ ఎత్తి తొంగిచూస్తుండేది. అది

మనకు వివాహం అయ్యే అవకాశం లేదేమో అనే దిగులు. ఆ దిగులు లేచినపుడు ప్రతి చూపూ బాధగా గోచరించేది, ప్రతి మాటా ముల్లు అయి గ్రుచ్చుకొనేది, ప్రతి స్పర్శా నిప్పు అయి కాలుతుండేది.

అవును, నాకు పూర్తిగా గుర్తున్నది. మొదట మన చూపులు కలవటం, తరువాత మాటలు తరువాత చేతులు కలవటం లాంటివి మన ప్రచ్ఛన్న ప్రేమను ఎంత గాఢంగానో పెంచినాయి. ఆరోజుల్లో మనం వియోగాన్ని మాత్రమే సహించకలగక సంయోగాన్ని కూడ సహించకలిగే వాళ్లం కాదు. వియోగం అగ్ని జ్వాల అయి మండుతుంటే సంయోగం హిమజ్వాల అయి మండేది. భవిష్యత్తులో వస్తుందని భయపడే ఆటంకం వర్తమానపు సుగంధంలో విషవాయువులను కలిపేది.

గుర్తున్నదా? మనం ఎన్నోసార్లు ప్రయత్నించాం మన ప్రేమను శరీరాలకు అతీతంగా ఉంచాలని, మనం మంచి ఏకాంతంలో కలుకున్నపుడు కూడ చాలాసార్లు శరీర స్పర్శలకు దూరంగా కూచొని మాటాడుకొనే వాళ్లం. అది మన ప్లెటానిక్ ప్రేమ అని గర్వించే వాళ్లం. కాని ఆ విధమైన నిర్లిప్తావస్థ ఎక్కువ రోజులు నిలచి ఉండేది కాదు. తిరిగి ఒకరినొకరు తాకంది ఉండకలిగే వాళ్లం కాదు. ఆరోజు గుర్తున్నదా? ఆ తోటలో మీ వడిలో తలఉంచి మనం మౌనంగా మేఘమాలల కదిలే నీలి రంగును చూస్తున్నప్పుడు మీ తండ్రి మనను చూడటం జరిగింది మొదటిసారిగా. మనం మేఘాలను చూస్తుంటే ఆయన మనను చూస్తున్నాడు. మన చేత చూడబడ్డ మేఘాలకేమీ ఇబ్బంది లేక పోయింది కాని మీ తండ్రి చేత చూడబడ్డ మనకు మాత్రం ఇబ్బంది ఏర్పడింది.

భలే వారు, అదీ ఒక ఇబ్బందియేనా? అది తాత్కాలికంగా ఇబ్బందిగా తట్టినా చివరిలో అన్ని ఇబ్బందులూ తొలగి మన మైహిక కాండ సుఖాంతంగానే ముగిసింది. ఆల్స్ వెల్ దట్ యండ్స్ వెల్ అనుకొని సంతృప్తి చెందటం జరిగింది. తరువాత మన మైహిక జీవితాన్ని అందరి మైహిక జీవితాల కంటే శారీరకంగా మానసికంగా కూడ భిన్నంగా నడుపాలని అనేక నవ్య జీవన విధానాలను అవలంబించాం. కొన్నిటిలో సఫలత లభించింది. మరికొన్నిటిలో అసఫలత. కాని ఆ అసఫలతలు మన జీవితాలకు ఏ మాత్రం హానికలిగించ లేదు. అందువల్ల అసఫలతలను కూడ గౌరవించాం.

అవిగో మన ఇంటి వెనక పూసిన మల్లెపూలను కోసి తెస్తున్నారు. అవి కొంత దూరాన ఉండగానే వాటి సుగంధం మనను తన్మయం చేస్తుంది. అమ్మకానికి వచ్చిన మల్లెలకంటే మన ఇంటి మల్లెల సుగంధం ఎన్నో రెట్లు హృద్యంగా ఉంటుంది.

పూవులను వాడేది ఎక్కువగా స్త్రీలే. కాని పూవులను, ప్రత్యేకించి మల్లెపూవులను, స్త్రీల కంటే పురుషులే ఎక్కువ ప్రేమిస్తారు. కారణం, తాము తలలో ధరించిన పూవులు స్త్రీలకు తమ కంటికి గోచరించవు. వాటి సుగంధం కూడ ఇతర్లకు తట్టినంతగా స్వయంగా తమకు తట్టదు. మనుషులు తమ కళ్లను తాము చూడలేరు అద్దం సహాయం లేంది. ఇతర్లు సులభంగా చూడగలరు. స్త్రీల అలంకరణ కూడ అంతే. తమ స్వంత అలంకరణ, ముఖంలోని తమ స్వంత సౌందర్యం ఇతర్లకు కనిపించినంతగా తమకు స్వయంగా కనిపించదు.

నిజమే, అందుకే మల్లెపూలను నిండుగా అనుభవించేది స్త్రీల కంటే పురుషులే. మల్లెలవాసన చీకటిలోకంటె వెన్నెలలో ఎక్కువ ఆకర్షకంగా తడుతుంది. తెల్ల మల్లెలకు తెల్ల వెన్నెల ఉనికి కొంత కారణమై ఉంటుంది. వెన్నెలలోని మల్లెల వాసన మనలో ఒక భ్రమను సృష్టిస్తుంది - ఆ సుగంధం వచ్చేది మల్లె నుంచా లేక వెన్నెల నుంచా అని. వెన్నెలకు సుగంధం ఉండదని తెలిసినా కూడ సుదూర చంద్రబింబం నుంచి వెన్నెల కిరణాలు తమ వెంట సుగంధాన్ని తెచ్చి ఈ భూగోళాన్ని నింపుతున్నట్లు తడుతుంది.

ఇంతకూ ఏది నిజమంటారు? నాకు అనిపిస్తుంది సుగంధం వచ్చేది వెన్నెల నుంచీ, వెన్నెల వచ్చేది మల్లెల నుంచీ అని. అసలు ఏది దేన్నుంచి వస్తుంది అనేది ప్రధానం కాదు, దేన్నుంచి ఏది వచ్చినా వెన్నెలా, సుగంధం మాత్రం ఉండటం, ఉండి మ న ముక్కు ద్వారా, మన కంటి ద్వారా మన మానసాన్ని మానస సరోవరం చేయడం ముఖ్యం.

తప్పకుండా అంతే. వస్తుతత్వం వ్యక్తితత్వం మీద, వ్యక్తిత్వం మీద కూడ చెరగని ముద్రలను వేస్తుంది. అయితే, నా అభిప్రాయంలో చెరగని ముద్రల కంటే చెరిపే ముద్రలే ఎక్కువ విలువ కలవి. చెరగని ముద్రలు కొన్నాళ్లకు పాతబడి పోతాయి, పేలవమవుతాయి, ఆనందాన్నివ్వలేవు, అందాన్ని పోగొట్టుకొంటాయి. చెరిగే ముద్రలకు ఈ ప్రమాదం ఉండదు. ఒక ముద్ర చెరిగిపోతుంటే దాన్ని స్థానాన్ని మరో ముద్ర ఇతోధిక ఓజస్సుతో ఆక్రమిస్తుంటుంది.

ఏమిటే, ఇక మన ధోరణికి అంతం అంటూ లేదా? ఇది నిరంతర స్రవంతిగా ప్రవహించటమేనా?

మీకు విసుగ్గా ఉన్నదా ఈ ధోరణి? ఈ విశ్వ సృష్టి విచిత్రమైంది. భూగోళ సృష్టి అంతకంటే విచిత్రమైంది మానవ సృష్టి. ఇక మానవుని మాటల సృష్టివైచిత్ర్యానికి హద్దులే లేవు. ఆ మాటల సృష్టియే ఈ ధోరణి - తెంపు లేని తికమక ధోరణి!'

---

*Change is a glutton. It devours everything. From one generation to another. From the way we perceive the world around us to the way we conduct our lives. From the games people play to the writing instruments they put to paper. Think of the innumerable things that have gone out of circulation in the past two decades or are about to do so. Fountain pens, hand-winding gramophones, LP records, black and white films, weather vanes, rotary telephones, steam engines, buggies, paper straws, solar hats, the Gandhi topi. One could go on.*

* * *

There was a time not long ago when every newspaper had its own clear or blurred identity. The new trend is for media persons themselves to develop sharper individual identities. This would be by no means an unhealthy development if it made for a more meaningful discussion of controversial issues. But no noise-free debate is possible if media persons become political activists and, instead of reporting and commenting on events to the best of their knowledge, try to shape them by turning into advisors and confidants of party and factional bosses and start fancying themselves in the role of news-makers.

— Syam Lal

# సాహిత్యంలో మౌలికత గురించి?

- డా॥ ముకురాల రామిరెడ్డి

ఇప్పటికివి అసంపూర్ణ భావనలు అనుకున్నా విమర్శకులూ, పరిశీలకులూ ఆలోచించదగ్గ వని భావిస్తున్నాను.

సాహిత్యగ్రంథాలు ఏనాటివైనా వాటిలో ప్రధానంగా ఉండే విషయాలు రెండు: ఏవో ధార్మిక సిద్ధాంతాలు, సాంఘిక-రాజకీయ సిద్ధాంతాలు, వాటి రాద్ధాంతాలు సాహిత్య రచనల్లో ధ్వనిస్తుంటాయి; కొన్నిచోట్ల సూటిగానే అవగతమవుతుంటాయి. ఈ సిద్ధాంతరాద్ధాంతాల మూల కర్తలు ఆ సాహిత్యరచయితలు కానట్లు సులభంగానే గ్రహిస్తాం - రెండవది, రచయిత రూపొందించిన/ అనుసరించిన కథా, కమామిషూ, ప్రక్రియా, రచనారీతులూ, ఛందస్సు వగైరా. కేవలం సాహిత్య కళాకేళి పక్షంగా ఈ అంశాలను గుర్తించి వీలైనంతవరకు విడదీసి, వింగడించి, తైపారువేసి చూస్తే ఇందులోనూ రచయితలు ఒకరినొకరు అనుసరిస్తూ వచ్చిన విన్యాసాలే ఎక్కువగా కనిపిస్తాయి!

తామెంత మలుపు తిరిగిచెప్పినా పూర్వుల దృక్పథంతో అవే పద్ధతులతో చెప్పిన రచయితలంతా సంప్రదాయమార్గం అనుసరించినవారే అవుతారు. అనుసరణలో, అనువాదంలో, ప్రక్రియను మార్చిచెప్పిన యుక్తిలోకూడా రచయితలు సంప్రదాయపోషకులుగానే కనిపిస్తారు. స్వతంత్ర రచయితలనిపించుకోరు. ఉదా. వాల్మీకి రామాయణాన్ని ఆయా దేశభాషల కవులు గద్యపద్యాలలో ఎన్నో రీతుల్లో రచించారు. అదే కథను నాటకాలుగా, యక్షగానాలుగా, తంబుర కథలుగా, గేయకథలుగా రచించిన వారెందరో? దాన్నే నేటి వచనపద్యంలో రచించే కుర్రరచయితలు అనేకులుండవచ్చు. వీరి 'స్వతంత్ర ప్రతిభ' ఇది అని నిక్కచ్చిగా లెక్కగట్టే ఉపాయం దొరుకుతుందా? ''మేక తోకకు మేక తోక మేకకుతోక'' అన్నట్లుంటాయి పైరకం రచనలను సమర్థించేవాదాలు. రామాయణాన్ని అన్నిరకాలుగా రచించవలసిన అవసరం లేదంటారా? అనే అసెంబ్లీ ప్రశ్న రావచ్చు. ఆ అవసరం కూడా ఉంది, ఉంది. అది ప్రచారపక్షం. ప్రచారంకోసమని ఏరచననైనా ఎన్నిరకాలుగానైనా రూపొందించుకోవచ్చు. ఇక్కడ ప్రతిభను గురించి, ముఖ్యంగా రచయితల స్వతంత్ర ప్రతిభను గురించి చర్చిస్తున్నాం. ఈ దృక్పథం వేరు.

రచయిత ఎంత స్వతంత్రుడైతే అంత సృజనాత్మకతను ఆవిష్కరిస్తాడు. అది ప్రాచుర్యంగా నిలిస్తే దాన్నే మౌలికత (సృజనాత్మకత) అంటాం.

అటు నూతన సిద్ధాంత ప్రవక్తగా, ఇటు నూతన సృజనాత్మక రచయితగా నిలదొక్కుకున్న స్వతంత్ర ప్రతిభావంతుడు యుగానికొక్కడైనా కనిపిస్తాడా? వెతుక్కోవలసిందే. ఎందుకంటారా? ప్రతి రచయితా ఒక నూతన సిద్ధాంత ప్రవక్త కానేరడు (అలా కావలసిన అవసరంకూడా లేదనే దృక్పథం ఒకటుంది). మహాకవులుగా, మహా మహారచయితలుగా సాహిత్య చరిత్రల్లో కనిపించే రచయితలెందరో నూతన సిద్ధాంత ప్రవక్తలుకారు. కనీసం నూతన సిద్ధాంత ప్రతిపాదకులైనా కారు. రచయితలెప్పుడూ మధ్యవర్తులే. ఆయా మత-

ధార్మిక-రాజకీయాది సిద్ధాంత ప్రవక్తలకూ సాధారణ పాఠకులకూ మధ్య వ్యాఖ్యాతలుగా ఉంటారు రచయితలు. ప్రవక్తల భాషణరీతి సాధారణ పాఠకులకు, ప్రజలకు తెలియదు. పాఠకులకు ఏరీతిలో చెప్పాలో, ప్రజలకు ఏభాషలో చెప్పాలో రచయితలకు తెలుసు. ప్రవక్తల భావాలను సాహిత్య రచయితలు తమ భావపరిమళాలతో మిళాయించి ప్రజలకూ, పాఠకులకూ వినసొంపుగా చెబుతారు. అందుకని రచయితలు మధ్యవర్తులే అవుతున్నారు. ఇదే సంగతిని మరికొంచెం మనదేశ సాహిత్య చరిత్రనుంచే చూద్దాం:

వైదిక ధర్మంవెంట సంఘాన్ని నడిపించాలి అని ప్రవక్తలు ఆదేశించినప్పుడు రచయితల గ్రంథాలు వైదిక పరంగానే ప్రచారాలు సాగించాయి. బౌద్ధం వచ్చింది. రచయితల కథలూ, కావ్యాలూ అవైపే సాగాయి. అలాగే శైవం ప్రభావం వేసినప్పుడు శైవంగురించీ, వైష్ణవమే అందరికీ ముక్తిదాయకం అన్నప్పుడు వైష్ణవం గురించీ - రెంటికీ సమన్వయాన్ని ప్రవక్తలు రూపొందించినప్పుడు హరిహరనాథ తత్వం గురించీ - రచయితలు తమ సాహిత్య ప్రతిభను ప్రదర్శించారు. ఆయా మత-ధార్మిక విషయాలూ, సిద్ధాంతాలూ రచయితలు రూపొందించి నవికావు కాబట్టి వాటి లోటుపాట్లలో రచయితల బాధ్యత ఏమీలేదు. సిద్ధాంత దృష్టి భేదంతో వారికి పొత్తులేదు. సిద్ధాంత ప్రచారమే వారివంతు. ఇందులో రచయితల సృజనాత్మకతా/మౌలికతా వెతకవలసిన పనేలేదు.

మధ్యయుగంలో మత సమన్వయ వాదాలొచ్చాయి. కబీరు వచ్చాడు. సూఫీ - అద్వైత భావనలు అల్లుకుపోయాయి. హిందూ-ముస్లిముల మధ్య మతసహనం ఏర్పడింది. ఆ తర్వాత దేశభక్తి తత్వం వచ్చింది. జాతీయ భావప్రవక్తలు వచ్చారు. జాతులమధ్య ఘర్షణలు మాన్పించే ఏకమానవతా వాదం వచ్చింది. సాంఘిక-ధార్మిక తత్వదృష్టి ఎటుమళ్ళితే రచయితలు తమ దృష్టిని అటువైపే తిప్పారు. ఇప్పుడు సోషలిజానికీ, సర్వమానవ సమతాదృక్పథానికీ జై అంటున్నారు రచయితలు. రచయితలు మేధావులకు రమణీయమైన వ్యాఖ్యాతలు కావచ్చు; మేధావులంత, ఋషులంత, ప్రవక్తలంత స్వతంత్ర ప్రతిభులా? 'ఋషిగానివాడు కవి కానేరడు' అనేమాట వినటంవరకు బాగుంది. ఇప్పటి రచయితల్లో ఎవరెవరిని ఋషుల స్థాయిలో గౌరవిద్దాం? అనుకున్నప్పుడు చిక్కులు వస్తాయి.

ఆయా సిద్ధాంతాల, ఇజాల లక్ష్యాలను వ్యాఖ్యానించే రచయితలకు సొంతదృష్టికొంత ఉన్నా అది ప్రదర్శించటం చాలా చోట్ల అసందర్భమవుతుంది కాబట్టి నాటి సాంఘిక-ధార్మిక తత్వాలను అనుసరించినప్పుడైతేనేమి,నేటి ఇజాలను అనుసరిస్తున్నపుడైతేమి, రచయితలు అస్వతంత్రులుగానే మిగుల్తారు అన్నంతమాత్రాన, రచయితల సాహిత్య ప్రతిభకు లోటేమీ రాదు. ఆయా సిద్ధాంతాలనూ, ఇజాలనూ మనోరంజకంగా చెప్పేకోసం కల్పించిన కథల్లో, పాత్రల్లో, ప్రక్రియల్లో, రచనా కళలో చూపిన సాహిత్య ప్రతిభ రచయితలదే. ఒకే పాత్ర చిత్రణలో రచయితల దృష్టిభేదం ఉన్నట్లు చూస్తాం. ఉదా. వాల్మీకి సీత, దిఙ్నాగుని సీత, తిక్కన సీత, నార్ల సీత. ఇలా రచయితలు కల్పించిన భావమూర్తులను వివిధాలుగా చూస్తాం కానీ, శంకరాద్వైతానికీ, నన్నయ అద్వైత భావాలకూ, మరోపక్షంగా తిక్కన అద్వైత భావాలకూ తేడాలు ఉన్నట్లు ఎవరూ చెప్పరు. రచయితలు వేరైనా వారి అద్వైత దృష్టి ఒక్కటే - మౌలికంగా అద్వైతదృక్పథాలే వేరైన సంగతులున్నాయి: వ్యాసాద్వైతం, శంకరాద్వైతం, శైవాద్వైతం, విశిష్టాద్వైతం, అచలాద్వైతం ఇలా ఇలా ఈ ఆధ్యాత్మిక దృష్టులు వేరు

వేరుగా చెప్పిన వింగడింపులున్నాయి. అవి మౌలిక సిద్ధాంతంమీది రాద్ధాంతాలు. రచయితలు ఆయా సిద్ధాంత శాఖలను గురించి చెప్పవలసివస్తే ఆయా మూలసిద్ధాంత కర్తల పంథాననుసరించే చెప్పవలసి ఉంటుంది. స్వతంత్రంగా చెప్పే అవకాశం ఇలాంటి విషయాల్లో ఉండదు - కథాకల్పన, వర్ణన, పాత్రచిత్రణ, ఛందస్సు, భాష, శైలి, ఇలాంటి రచనాంశాలను తీర్చిదిద్దే పనితనంలోనే రచయిత స్వతంత్రుడు, అనే భావన మిగులుతుంది కానీ,

ఈ రంగంలోనైనా స్వతంత్రులుగా తమ సొంత ప్రతిభను ఆవిష్కరించి మౌలిక రచయితలుగా నిలదొక్కుకున్నవారెందరు? ఎలాంటివారు? అనే ప్రశ్నలు వెనకటికే పుట్టాయి. వీటికి సమాధానాలు నామాటల్లో చెప్పటంకంటే సృజనాత్మక సాహిత్యాన్ని గురించి చెబుతూ నకలు సాహిత్యకారుల గుట్టు రట్టుచేసిన పూర్వాలంకారికుల మాటల్లో చెప్పటమే సబబు - భామహాచార్యుని దృష్టి పరిధిలో మౌలిక కవి దొరకటమే కష్టమైంది. మౌలిక కవి సంగతి అడుగుతారా? ఎప్పుడో ఒకప్పుడు, ఏదో యుగంలో ఒకడు పుట్టవచ్చు అన్నాడు. అభినవగుప్తుని అడిగితే సంస్కృత భాషలో సృజనాత్మక కవులు ఇద్దరు, ముగ్గురు పోనీ ఐదుగురు వరకు లెక్కవేసుకోండి అన్నారు.

ఈ ఐదుగురెవరు? వాల్మీకి, వ్యాసుడు, అశ్వఘోషుడు, దిజ్ఞాగుడు తర్వాత భాసుడో, సౌమిల్లికుడో లెక్కలోకి రాకతప్పదు. భాసుడూ, సౌమిల్లకుడూ గొప్పనాటక రచయితలైనట్లు కాళిదాసే పొగిడాడు. అభినవగుప్తుని లెక్కప్రకారం ఐదుగురిని ఎన్నుకోబోతే సౌమిల్లకుడు ఎగిరిపోతాడు. కాళిదాసు విలాసమే మిగలదు. మౌలిక కవుల పట్టికలోంచి కాళిదాసుపేరే పొటాగొడితే సాహిత్య కళావేదిక నలంకరించటానికి తర్వాతికవుల తాహతుఎంత?

ఈనాటి రచయితల గ్రంథాలకెన్నిటికో పీఠికలు రాసేవారు 'ఇదో గొప్పరచన' అన్నట్లు చెబుతారు. ఆయా రచయితలను గురించి సభలల్లో ప్రసంగించేటప్పుడు వారిగొప్పతనాలు చెబుతారు. అవి మనకు సరిగ్గా అర్థమేకావు. రోజూ గ్రంథావిష్కరణలు జరుగుతుంటాయి. మరునాడు ఆరచయిత పేరు జ్ఞాపకం వుండదు. గ్రంథం పేరూ జ్ఞాపకం వుండదు. కనీసం బహుమతులుపొందే గ్రంథాల పేర్లయినా జ్ఞాపకముంటున్నాయా? వాటి నెందరు చదువుతున్నారు? తరచూ పత్రికల్లో కనిపించే రచయిత కొన్నివారాలపాటు కనిపించకపోతే అతను గతించాడేమో అనే అనుమానం తగులుతుంది. మా చిన్నతనంలో ఏదైనా మంచి రచన పత్రికలో వస్తే దాన్ని కత్తిరించి పెట్టుకునేవాళ్ళం. ఇప్పుడటువంటి బుద్ధి పుట్టటమే లేదు! ఇకచూస్తే సృజనాత్మక రచయితలను/మౌలిక రచయితలను గుర్తించటంలో ఉన్న దృష్టిలోపం పూర్వాలంకారికులదా? నేటి విమర్శకులదా? ఇవి మిగులుతున్న ప్రశ్నలు.

''సాహిత్యంలో నకలు రచయితలే అధికంగా ఉంటారు. ఉత్తమ రచయితల శైలినీ, పదాలనూ, అర్థాలనూ, భావాలనూ, తదితర పోవడులనూ బహు చలాకీగా నకలు కొడుతుంటారు. జాగ్రత్తగా పరిశీలించండి'' అన్నాడు రాజశేఖరుడు. ఫలానా నవల తమ నవలకు నకలు రచన అంటూ కోర్టులో దావావేసిన రచయితలు నేడూ ఉన్నారు.

కవికంఠాభరణ కర్త పరిశీలననుబట్టి సాధారణంగా కనిపించే కవులంతా నాలుగు రకాలుగా లెక్కబడతారు. మార్గదర్శి రచయిత అనదగినవాడు ఐదోరకం - నాలుగురకాల సాధారణ కవుల్లో మొదటివాడు 'పాదోపజీవి'. అంటే ఇతర కవుల పద్యపాదాలు నకలుగొట్టేవాడని ఒక అర్థం. ఎవరిపాదాలో పట్టుకుని కవిగా చెలామణీ అయ్యేవాడని రెండో అర్థం - రెండోవాడు

'పదకోపజీవి'. అంటే ఇతర రచయితలు అందంగా కూర్చిన పదాలు నకలుకొట్టేవాడని ఒక అర్థం. పదకాలూ, బిరుదులూ, సన్మానాలూ, బహుమానాలూ సంపాదించి కవిగా ఊరేగేవాడని మరో అర్థం - మూడోవాడు 'ఛాయోపజీవి.' ఆశ్రయంతో బతికేవాడని ఒక అర్థం. ఇతరుల భావచ్ఛాయలను నేర్పుగా తనవిచేసుకుని చెలామణీ అయ్యే కవినామకుడని మరో అర్థం - నాల్గోవాడు 'సకలోపజీవి.' అంటే కవిగా చెలామణీ కావడానికి ఎన్ని బూటకాలు, కుయుక్తులు చేయాలో అన్నీ చేసేవాడని అర్థం. నిశితమైన విమర్శ క్షేమేంద్రుదిది. విమర్శకులు కూడా రచయితలే. పైగా రచయితలకే మార్గదర్శకులైన రచయితలు విమర్శకులు కాబట్టి వారి ధృష్టి భేదాలనుకూడా ఈ సందర్భంలో పేర్కొవలసి వచ్చింది - అదేవరసలో చెప్పిన ప్రకారం ఐదోరకం రచయిత 'భువనోపజీవ్యుడు' (మార్గదర్శి కవి). అతని రచనలు చదివిన పాఠకులు రచయితలుగా మారుతారు. అతని రచన ఆధారంగా అనేక సాహిత్య ప్రక్రియలు పుట్టుకురావచ్చు. అతడు వాల్మీకివంటివాడో, వ్యాసునివంటివాడో! అలాంటిరచయితే సృజనాత్మక రచయిత/మౌలికరచయిత అని క్షేమేంద్రుని అభిప్రాయం.

ఇతివృత్తాన్ని కొత్తగా కూర్చటంలో లేదా సరికొత్తగా తీర్చిదిద్దటంలో - రచనలో నూతనమైన సౌందర్యాలు పొదగటంలో - భావాలు నవ్య రామణీయకాలుగా కల్పించటంలో ఉంటుంది సృజనాత్మకత/మౌలికత. తెలుగు సాహిత్యాన్ని ఈ దృష్టితో చూసినప్పుడు దానికి కొత్త చరిత్ర ఏర్పడుతుందని ఆశించవచ్చు. నేటి విమర్శకు లేమంటారో మరి.

★

# THE CRYSTAL BALL

"Life was cheap; nothing was absolutely safe or sure; deeds of injustice and violence were common facts in their daily lives. [But] events, however revolting, are soon forgotten by the outside world and it is in the inner consciousness of moral deterioration and in the loss of self-respect that the nations [of the Balkans] will chiefly suffer."

FROM A 1913 INQUIRY BY THE CARNEGIE ENDOWMENT FOR INTERNATIONAL PEACE INTO THE CAUSES AND CONDUCT OF THE BALKAN WARS

## Where have all the Leaders gone

"We cannot think of a period where there have been so few great leaders"

"We Seem to be led by Mediocrities. It's sort of political peter principle"

The soviet Empire's Deth was so abrupt as to leve the prevailing nations Flat Footed. No one really planned for it believed it could happen

"The Stock of old Answers is obsolete, but the leaders are still using the old answers" —By JAMES WALSH TIME

# తనాటో ఫోబియా

**- వాసిరెడ్డి సీతాదేవి**

''ఫోబియా'' అనే పదం ''ఫోబాస్'' అనే గ్రీకు శబ్దం నుంచి వచ్చింది. భయం—దీన్ని ఎప్పుడో ఓసారి అనుభవించని మానవుడే ఉండడు. అన్ని జీవజంతువులకూ భయం అనేది ఉంటుంది. ఒక మాటలో చెప్పాలంటే ఈ భయమనే ప్రవృత్తే లేకపోతే జంతుజాలం తమ ఉనికిని ఏనాడో పోగొట్టుకొనేవి. అంటే వంశాభివృద్ధి ఉండేది కాదు. డార్విన్ థియరీ ప్రకారం ప్రకృతి యోగ్యప్రాణిని అభివృద్ధి కావిస్తుంది. ఏ ప్రాణి తన ఉనికికి అంతరాయం కలిగించే ఆపదల నుంచి తప్పించుకొని నిలబడగలదో దాన్ని యోగ్య ప్రాణిగా గుర్తించడం జరిగింది.

భయంవల్లనే ఆదిమానవుడు గుంపుగా బతికాడు. తరువాత సామాజిక జీవిగా మారాడు. భయం వల్లనే మనిషి ఎన్నో తప్పు పనులు చెయ్యాలని ఉన్నా చెయ్యడు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే భయం కూడా మానవ జీవితం అభ్యుదయ పథంలో పయనించడానికి ఎలా ఉపయోగపడిందో, పడుతుందో పేజీల కొద్దీ చెప్పవచ్చును.

సాధారణ భయం వేరు, ఫోబియా వేరు. ఫోబియా ఒక మానసిక రుగ్మత. ఈ ఫోబియాలు ముప్ఫయ్ పైగానే ఉన్నట్లు గమనించారు మానసిక వైద్యులు.

ఇందులో ''తనాటో ఫోబియా'' ఒకటి. అంటే మృత్యుభయం. చావంటే ఎవరికి భయం ఉండదని మీరు అడగొచ్చును. అవును నిజమే. చావంటే అందరికీ భయం. ''నాకు చావంటే భయం లేదు'' అని ఎవరైనా అంటే వాళ్లు అబద్ధం చెప్తున్నారనేది నిజం. అయితే ఇందులో మోతాదు భేదం ఉండొచ్చును. ఈ లోకంలో అన్నీ ఉంటాయి. అందరూ ఉంటారు-బంధువులు-స్నేహితులు-హితులు-అహితులు అందరూ ఉంటారు. తను మాత్రం ఉండడనే భావంవల్లనే మనిషికి చావంటే భయం. ఈ భయం వేరు. ఫోబియా వేరు. ఈ ఫోబియా ఎంత భయంకరంగా ఉంటుందో చూడండి—

ఒక స్త్రీ మానసిక వైద్యుని దగ్గరకు వచ్చింది. ఆమెను ఆమె భర్త తీసుకొచ్చాడు.

''ఈమె పేరు సుజాత— నా భార్య. వయసు ముప్ఫయి అయిదు సంవత్సరాలు. నా పేరు రవికిరణ్'' పరిచయం ఇచ్చుకున్నాడు.

''ఏమిటి సమస్య'' అడిగాడు మానసిక వైద్యుడు సుజాత ముఖంలోకి చూస్తూ. ఆమె కళ్లు ఎర్రగా ఉన్నాయి. కళ్ళ చుట్టూ నల్లటి వలయాలున్నాయి. వచ్చిన పది నిమిషాల్లో రెండుసార్లు ఆవలించడాన్ని గమనించాడు.

''నిద్ర పట్టడం లేదా?'' డాక్టరు అడిగాడు.

''అవునండీ. దాదాపు ఒక వారం రోజులుగా సుజాత నిద్రపోలేదు. రాత్రిళ్లు కూర్చునే ఉంటుంది.''

''నిద్ర రావటం లేదా?''

''వస్తుంది, చాలా నిద్ర వస్తోంది.''

''అవును డాక్టర్. ఆవలిస్తుంది. కళ్ళు మూసుకుపోతుంటాయి. పడుకోమంటే పడుకోలేదు. ఆమెతోపాటు ఎవరో ఒకరు కూర్చునే ఉండాలి'' అన్నాడు ఆమె భర్త.

డాక్టర్ సాలోచనగా చూశాడు. కొద్ది నిముషాలు మౌనంగా ఉండిపోయాడు.

''ఏమ్మా. నిద్ర రాకపోతే కాంపోజ్ వేసుకోవచ్చుగా?''

''నిద్ర బాగానే వస్తుంది.'' ఆమె భర్త ఏదో చెప్పబోయి డాక్టరు కళ్ళతోనే వారించడంతో ఆగిపోయాడు. ''మరి నిద్రొస్తే ఎందుకు నిద్రపోవూ?'' డాక్టరు అడిగాడు.

''నాకు మంచం మీద పడుకోవాలంటే భయం వేస్తోంది. నిద్రపోవడానికి చాలాసార్లు ప్రయత్నించాను. మంచం మీద పడుకోగానే చివ్వున లేచి కూర్చుంటున్నాను. ఏదో భయం నన్ను వెన్నాడుతోంది డాక్టర్! అలసిపోయి, నిద్ర ముంచుకొస్తున్నా..... నో! నో! నేను నిద్ర పోకూడదు. నేను నిద్రపోకూడదు'' అని మనసులోనే అనుకుంటాను.

''ఎందుకలా ఉందో ఆలోచించారా?''

''ఆలోచించాను. ఏదో భయం - ఆ భయంతోనే నిద్ర పోకూడదని నా మనసు ప్రతి నిముషం హెచ్చరిస్తోంది. నేను ఈ నరకం భరించలేకుండా ఉన్నాను!'' అంటూ ఒక్కసారిగా బావురుమన్నది.

''ఇదీ వరస డాక్టర్.'' ఆమె భర్త అన్నాడు.

''మీరేమి మాట్లాడకండి'' అన్నాడు డాక్టర్.

ఆమె కొద్దిసేపు రోదించి కళ్లు తుడుచుకుంది.

ఈ మధ్య మీకు ఏదైనా జబ్బు చేసిందా?''

''అవునండి. తల తిరగడం, నడుస్తూ తూలడం మొదలైంది. డాక్టర్ దగ్గర కెళ్తే కొంచెం బ్లడ్ ప్రెషర్ ఉందని మందులిచ్చాడు.''

''ఎంతకాలం అయింది?''

''వారం రోజులు అయింది.''

''ఆ రోజు నుంచేనా నిద్రపోవాలంటే భయం?''

''అవును డాక్టరుగారూ?'' అన్నాడు ఆమె భర్త.

''నిద్రపోతే చచ్చిపోతానని భయంగా ఉంది కదూ?''

ఆమె కొన్ని నిముషాలు ఆలోచించింది, ''అదేం లేదండీ. అలా స్పష్టంగా కారణం ఏమీ తెలియడం లేదు. ''నిద్రపోవద్దు, నిద్రపోవద్దు'' అంటూ నా మనసు హెచ్చరిస్తోంది.''

''పగటి పూట?''

''పగటిపూట కూడా ప్రయత్నించాను. మంచం మీద పడుకోవాలంటే భయం. ధైర్యం చేసి ప్రయత్నించినా చివ్వునలేచి కూర్చున్నాను. కుర్చీలో వెనక్కు వాలి అప్పుడప్పుడు కొంచెం సేపు నిద్రపోతాను. అదీ పగలు పడక కుర్చీలో పడుకోవాలన్నా భయమే. నాకు ఈ బతుకుకంటే చచ్చిపోవడం మంచిదనిపిస్తోంది డాక్టర్!''

డాక్టర్‌కు నవ్వొచ్చింది. కాని నవ్వలేదు. ఆమె జబ్బు మృత్యుభయం అని డాక్టర్‌కు అర్థం అయింది.

''మీ ఇంట్లో ఎవరికైనా అంటే మీ అమ్మగారికి కానీ. నాన్న గారికి కానీ బ్లడ్ ప్రెషర్ ఉందా?''

''మా నాన్నగారికి ఉండేది.'' ''ఆయన ఇప్పుడు లేరు. చనిపోయారు.''

''ఎప్పుడు పోయారు?''

''అపుడు నాకు తొమ్మిదేళ్ళు.''

''ఆయన ఏ సమయంలో ఎలా పోయారో గుర్తుందా?''

ఆమె గతంలోకి జారిపోయింది. ఏదో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించసాగింది. ఆమె మనసులోని సంఘర్షణ డాక్టర్ ఆమె ముఖంలో చూడగలుగుతున్నాడు. ''గుర్తు రావడం లేదు డాక్టర్!''

''గుర్తు చేసుకోండి.''

''గుర్తు రావడం లేదు.''

డాక్టర్ ఆమెను బల్లమీద పడుకోమన్నాడు.

''ఆమె భయంగా చూసింది. ''నో! నో! నేను పడుకోను'' పిచ్చిగా అరిచింది.

''ఓ. కే. అలాగే గోడకు జారబడి కూర్చోండి. నేను చెప్తున్న మాటల్ని శ్రద్ధగా వినండి.'' అంటూ ఆమెను హిప్నటైజ్ చేశాడు. నిద్ర ముంచుకొస్తున్న స్థితిలో ఉన్న ఆమె కొద్ది నిముషాల్లోనే హిప్నటైజ్ అయింది. డాక్టర్ సజెషన్స్ ఇవ్వడం ప్రారంభించాడు. ఏజ్ రిగ్రెషన్ లోకి ఆమె మనసును పంపించాడు.

''ఇప్పుడు నీకు తొమ్మిదేళ్లు'' అని రెండు, మూడుసార్లు అని ''పాపా!'' అని పిల్చాడు.

''ఆమె ''ఊఁ'' అన్నది. అప్పుడు డాక్టరు ప్రశ్నలు ప్రారంభించాడు. ఆ ప్రశ్నలకు ఆమె చిన్నపిల్లలాగే సమాధానాలు ఇస్తుంటే ఆమె భర్త ఆశ్చర్యంగా వింటూ కూర్చున్నాడు. ఆ ప్రశ్నల ద్వారా తెలిసిన విషయం-

ఆమె తండ్రికి బ్లడ్ ప్రెషర్ ఉండేది. ఒకరోజు ఉదయం ఏడుపులు వినిపించి సుజాత తుళ్ళిపడి లేచింది. తండ్రి శవం చాపమీద ఉంది. రాత్రి ఎప్పుడో నిద్రలో పోయాడనీ, నిద్రపోయే ముందు బాగానే ఉన్నాడనీ అందరూ అనుకోవడం విన్నది ఆ పాప.

ఆమెకు తెలియకుండానే నిద్రపోతే చచ్చిపోతారనే భయం ఏర్పడింది. అప్పుడు ఆ భయం ఆమెను అంతగా భయపెట్టలేదు. కాని మనసులోనే అట్టడుగు పొరల్లో ఆ భయం ఆమె వయసుతోపాటు పెరిగింది. ఆమెకు బ్లడ్ ప్రెషర్ అని డాక్టర్ చెప్పగానే ఆమె మనసులోని అట్టడుగు పొరల్లో దాగిఉన్న భయం బయటపడింది.

ఆమెను హిప్నటిక్ స్లీప్ నుంచి మేల్కొలిపాడు డాక్టర్. ఆమె ముఖం తేటగా ఉంది. కళ్లలోకి జీవకళ వచ్చింది. ఆమెకు, ఆమె భయానికి కారణం ఏదో చెప్పాడు. అప్పుడు ఆమెకు చిన్నతనంలో జరిగిన విషయాలు గుర్తొచ్చాయి.

''మీ నాన్న బ్లడ్ ప్రెషర్ తో పోలేదు. ఆయన గుండె ఆగిపోయింది. మీ గుండె శుభ్రంగా ఉంది. మీకు ఆ భయం అక్కర్లేదు.'' అని చెప్పి ''ఈ రాత్రికి ఈ మాత్రలు వేసుకోండి. నిద్ర వస్తుంది. మంచంమీద పడుకొన్నా భయం వెయ్యదు'' అని చెప్పాడు. ఆమె ఆ రాత్రి నిద్రపోయింది. ఆ తరువాత అలాంటి భయం ఆమెకు మళ్ళీ రాలేదు.

ఇలాంటి భయం (ఫోబియా) ఉన్న వ్యక్తులకు తమ భయానికి కారణం తెలియదు. చిన్నతనంలో మనసును బాధపెట్టి, భయపెట్టిన కొన్ని సంఘటనలవల్లనే ఈ ఫోబియాలకు గురిఅవుతారు. ఈ భయాలు కొన్ని సమయాల్లో చాలా భయంకరంగా ఉంటాయి. సుజాత పరిస్థితి కూడా అలాంటిదే. వారి భయానికి కారణం తెలిస్తే భయం పూర్తిగా పోతుంది కొందరికి, మరి కొందరికి ఆ భయ తీవ్రత తగ్గుతుంది. ★

# తెలుగులో తాత్త్విక నవల

**- ఆర్.ఎస్. సుదర్శనం**

సాహిత్య ప్రక్రియగా నవల తొలినాటి నుంచీ నేటివరకూ ఎన్నో విధాల రూపాంతరం చెందుతూ వస్తున్నది. కథ ప్రధానం, కథ కాలక్షేపం కోసం, అనుకునే ప్రథమావస్థలో అద్భుత సంఘటనలూ, సన్నివేశాలూ ప్రాధాన్యం వహించేవి. కథలోని పాత్రల్లో వైశిష్ట్యం కనిపించి, వారి సుఖదుఃఖాలూ, చిత్తవృత్తీ పఠిత మనస్సుని ఆకర్షించే లక్షణం కథకు ఏర్పడగానే అది నవల అయింది. 'కాశీరామేశ్వర మజిలీ కథల'కూ, చిలకమర్తివారి 'కర్పూర మంజరి'కీ గల తేడా యిదే! పాత్రల వ్యక్తిత్వం రూపుకట్టడం ప్రధానం కాగానే , సమాజంలో వ్యక్తుల ప్రవర్తన ఎలా ఉంటే బావుంటుందో నిర్దేశించడం నవలకు లక్ష్యంగా రూపొందింది. నవల కర్తవ్యోపదేష్టగా తయారైంది. తెలుగులో వీరేశలింగంగారి నుంచీ విశ్వనాథ, చలంగార్ల వరకూ నవల సాంఘిక సంస్కరణలను గూర్చి, సంఘంలోని వ్యక్తుల నడవడికీ వ్యవస్థకూ గల సంబంధాన్ని గూర్చి, జీవితంలో మంచిచెడ్డల నిర్ణయంలో తిరుగుబాటును గూర్చి ప్రబోధం చేస్తూనే వస్తోంది. ఈనాటికీ తెలుగు నవల ఈ లక్ష్యాన్నే నెరవేరుస్తున్నదని అంటే అతిశయోక్తి కాదు. కాని ప్రతి కర్తవ్య నిర్దేశం వెనుకా, ప్రబోధం వెనుకా, ఏ విధమైన జీవిత దృక్పథం ఉన్నది? దాని స్వరూపం, తత్త్వం ఏమిటి? అనే విషయాన్ని చాలకాలం ఎవరూ పట్టించుకో లేదు. ఆ రోజుల్లో చలంగారు 'మైదానం' వ్రాస్తే, విశ్వనాథవారు 'చెలియలి కట్ట' వ్రాశారు. ఇవి ఒకదాని కొకటి సమాధానం ఎలా అవుతవి? ఇద్దరి తాత్త్విక దృక్పథాలూ భిన్నమైనప్పుడు రెండింటికీ సమన్వయం ఎలా కుదురుతుంది? అప్పటికి దృక్పథాల గొడవను గూర్చి స్పృహలేదు. 1935 తర్వాత హేతువాదం, మార్క్సిజమ్, అభ్యుదయ సాహిత్యోద్యమం వచ్చాయి. ఒక తాత్విక, రాజకీయ దృక్పథాన్ని భూమికగా చేసుకుని సాహిత్యంలో కర్తవ్య నిర్దేశం, ప్రబోధం జరగాలి అనే ధోరణి బయలుదేరింది. అసలీ ప్రబోధంతో, దృక్పథాలతో సంబంధం లేకుండా యథాతథంగా జీవితాన్ని చిత్రించాలి అనే వాస్తవికతా వాదమూ (Realism) ఉన్నది. ఫ్లాబర్ట్, ఎమిలీజోలా, మొపాసావంటి ఫ్రెంచి రచయితలు ఇందుకు ఉదాహరణ. దృక్పథ నిర్దేశం లేకుండా వాస్తవికతావాదం ధోరణిలో తెలుగులో వచ్చిన నవలలు 'శారద' అనే హోటల్ సర్వర్ వ్రాసిన 'మంచీ-చెడూ', 'అపస్వరాలు'; పోతుకూచి సాంబశివరావు వ్రాసిన 'అన్వేషణ'. పోతే అనుభూతిపరమైన వైయక్తిక అన్వేషణతో, తాత్త్విక జిజ్ఞాసతో వ్రాయబడిన నవలలు - గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' హేతువాద దృక్పథ విమర్శగానూ, విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి' మానవతావాద విజయంగానూ, బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' మానవతావాది సత్యాన్వేషణగానూ రూపొందాయి. మార్క్సిస్ట్ దృక్పథం అనుభూతిపరమైన తాత్త్విక దృక్పథంగా రూపొందిన నవల వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి'. మహీధర రామమోహనరావు నవలల్లో కమ్యూనిస్ట్‌పార్టీ రాజకీయాల చిత్రణేతప్ప, మార్క్సిజమ్‌యొక్క తాత్త్విక దృక్పథ విన్యాసం కనిపించదు. 'ప్రజల మనిషి'లో వర్గరహిత, వర్ణరహిత సామాజికుడుగా కథానాయకుడు కంఠీరవం తన అనుభూతిద్వారా పరిణామం చెందడం దర్శిస్తాము. తాత్త్విక దృక్పథాన్ని నిక్షేపించే నవలలో ఈ అన్వేషణా, దాని

పరిణామమూ చాల కీలకమైన విషయాలు. దర్శనాన్ని గూర్చిన ఉపన్యాసాల కూర్పుకాదు తాత్త్వికనవల అంటే.

ముప్ఫై ఏళ్ళ క్రితం పై తెలుగు నవలల్ని గూర్చిన విమర్శ ఏ స్థితిలో ఉన్నదంటే, పాత్రల నీతి - అవినీతి ప్రవర్తనమూ, సామాజికంగా ఉచితానుచితాలనూ చర్చించే విధానమే తప్ప, ఒక నవలలో అభివ్యక్తమైన తాత్త్విక దృక్పథాన్ని గూర్చికాని, రచయిత రచనల్లో క్రమానుగతంగా ఉన్మీలనమౌతున్న అనుభూతిపరమైన తాత్త్వికాన్వేషణను గూర్చి కాని, ఆలోచించి నిగ్గు తేల్చుకునే దృష్టి దానికి లేదు. చలం రచనా వ్యాసంగం యావత్తూ ఒక బూతుల బుంగగా నిర్లక్ష్యం చేయబడింది. ఆ రోజుల్లో గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'ను ఆస్కార్ వైల్డ్ 'డోరియన్ గ్రే'కి అనుకరణ అంటూ త్రోసివేశారు. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' సోమర్సెట్‌మామ్ 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' నవలకు కాపీ అన్నారు. 1964లో 'నవ్యాంధ్ర సాహిత్యంలో దృక్పథాలు' అనే శీర్షికతో తెలుగు నవలా రచయితల అనుభూతిపరమైన తాత్త్విక దృక్పథాల్ని గూర్చిన పరామర్శ నేను ప్రారంభించాను. ''సాహిత్య వ్యవసాయమూ సత్యాన్వేషణమూ జీవితంలో ఒకటైన కవీ లేక రచయితా తన దృక్పథంలో సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తాడు. రచయితకు సంబంధించిన ఆ 'ఆత్మకథను' అతని సాహిత్యకృషి ప్రతిబింబిస్తుంది''. ఈ వరవడిలో జరిగిన పరిశీలనకు గట్టిగా నిలిచిన తెలుగు నవలా రచయితలు - ఉన్నవ, విశ్వనాథ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు. వీరి తాత్త్వికాన్వేషణను గుర్తించే విధానంలో రచనల్ని పరిశీలన చెయ్యగానే, వారి నవలలకు గల స్ఫూర్తి ఏమిటో తెలుసుకునే అవకాశం లభించింది.

ఇక్కడ చెప్పవచ్చిందేమిటంటే నవల పొందిన రూపాంతరాల్లో అత్యాధునికమైన రూపం - తత్త్వాన్వేషణకు నవల సాధనం కావడం. దీన్ని 'తాత్త్విక నవల' అనవచ్చు. ఒక నవలలో ప్రధాన పాత్రా, ఆనుషంగికమైన పాత్రలూ, కథా సంవిధానమూ, అన్నీ కూడా సామాజికమైన ధర్మాధర్మ నిర్దేశాన్ని కాకుండా, తాత్త్వికమైన వైయక్తిక అన్వేషణను ప్రధానంగా సూచిస్తూ రూపొందడంవల్ల అది తాత్వికనవల అవుతుంది. ఉదాహరణకు 'చివరకు మిగిలేది' తీసుకుందాం. తాత్త్వికమైన అన్వేషణ ఈ నవలలో దయానిధి పాత్ర ద్వారా జరుగుతుంది. కోమలి, అమృతం అనే పాత్రలు అందుకే దోహదం చేస్తాయి. మనోవిజ్ఞానశాస్త్రం దృష్ట్యా చూస్తే దయానిధి 'ఈడిపస్ కాంప్లెక్స్'తో బాధపడుతూ ఉండటం కనిపిస్తుంది. కాని 'ఈడిపస్ కాంప్లెక్స్' ఉన్న వ్యక్తులందరిలోనూ దయానిధిలో జరిగే తాత్త్వికాన్వేషణ జరగదు. అందుకే ఈ నవల మనోవైజ్ఞానిక నవల (Psychological novel) గా భాసించినా, తుది స్వరూపంలో తాత్త్విక నవల అయింది. "The tree is known by its fruit" అన్నట్లు దయానిధి చేరుకున్న గమ్యంవల్ల, అతను అధిగమించిన అవరోధాలవల్ల ఆ అన్వేషణ కొక స్వరూపం ఏర్పడింది. దానికి జీవితతత్త్వాన్ని నూత్న దృష్టిలో అభివ్యక్తం చేస్తూ, హృదయంగమంగానూ, మేధాగతంగానూ ఒక వ్యాఖ్యానాన్నీ అర్థాన్నీ పాఠకునికి అందించే లక్షణం ఉన్నది. అందువల్ల అది తాత్త్విక నవల అవుతున్నది. ధర్మవివక్షకోసం చూచే సామాన్య దృష్టికి దయానిధి కోమలితో ప్రవర్తించే తీరు, కోమలే కాదు, సుశీల, నాగుమణి, పెళ్ళిచేసుకున్న ఇందిర, తర్వాత అమృతం వగైరా స్త్రీలతో ప్రవర్తించే విధానం, ఎబ్బెట్టుగా, అయోమయంగా కనిపిస్తుంది. చిట్టచివర కోమలిని చేరదీయడం కూడా అర్థరహితంగానే తోస్తుంది. దయానిధి పాత్రలోగాని, జీవితంలోగాని ఏ ఆదర్శమూ, ఏ నీతీ, ఏ కర్తవ్యపాలనా,

అంటే సామాజికంగా అర్థవంతమైన ప్రవర్తన ఏదీ కనిపించదు. దీనికి కారణం నవల కలిగించే చివరి తాత్త్విక స్పృహ పఠిత అందుకోలేకపోతే నవల స్వరూపం అర్థంకాకపోవడమే: అంటే తాత్త్విక స్పృహ, సమాజంలో సిద్ధమైన కొన్ని విలువల దృష్ట్యా వెదికితే అందేదికాదు! నవల చివర దయానిధి అనుకుంటాడు. ''నేడు మన సంఘం ఆమోదిస్తున్న నీతిని ప్రతిపాదించిన వారు విచిత్రమైన గతించిపోయిన వాతావరణంలో ఉన్నారు.... మన సంఘంలో మనుష్యులు బద్ధకించి ఉన్న వాటితోనే తృప్తిపడి, మోక్షం పేరు చెప్పుకుని, యీ ప్రపంచాన్నీ, జీవితాన్నీ ఒక జాడ్యంగా, ఒక పీడకలగా భావించి ఎలాగో కాలం గడుపుతున్నారు... చివరకు మిగిలిందేది? ప్రేమా? ధనమా? కీర్తా? ఏదీకాదు... చివరకు మిగిలింది తను! తన్ను తాను పరిపూర్ణంగా చూశాడు. తనతో తను సమాధానపడి, తన్ను తాను స్వీకరించి, కౌగలించు కుని ఏకమయ్యాడు.'' ఇది ఆ నవలకు అనుభూతిపరంగా కీలకమైన తాత్త్విక దర్శనం: అక్కడినుంచీ దయానిధి పాత్రను, ప్రవర్తనను అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది.

సాధారణంగా నవలల్లో చిత్రింపబడే యితివృత్తం వ్యక్తికీ వ్యవస్థకూ మధ్య ఘర్షణ, యువతీ యువకుల రొమాంటిక్ ప్రేమ, త్యాగం, వర్గరహిత సమాజం, కారుణ్యం, దయ, క్షమ, విప్లవాభినివేశం, మంచిని పెంచడం సమర్థించడం, ప్రవర్తనలో నిజాయితీ వగైరా విలువల్నీ, ఆదర్శాల్నీ ముందు పెట్టుకుని ధర్మాధర్మాల, మంచి చెడ్డల ఘర్షణగా నవలల్లో చిత్రణ సాగుతూ ఉంటుంది. అంతవరకే తప్ప నవలలు ముందుకు వెళ్ళవు. ఇందులో ఏ ఒక్కదాని కైనా సమగ్రమైన వ్యాఖ్యానం తాత్త్వికంగా లభించాలి అంటే వ్యక్తి అన్వేషణను చిత్రింపక తప్పదు. ఆ అన్వేషణలో కేవలం ఆలోచనే కాకుండా అనుభూతి ప్రాధాన్యం వహిస్తుంది. అప్పుడే లోకం ఒక కొత్త వెలుగులో దర్శనమిస్తుంది.

ఈ పదేళ్ళలో వచ్చిన తాత్త్విక నవలలు, నాకు తెలిసి రెండే రెండు! ఒకటి వడ్డెర చండీదాసు 'హిమజ్వాల'; రెండోది నాదే: 'సంసార వృక్షం'. 'హిమజ్వాల'లో అన్వేషణ కృష్ణ చైతన్య, గీత అనే యిద్దరు పాత్రలద్వారా జరుగుతుంది. కృష్ణచైతన్యలో 'ఈడిపస్ కాంప్లెక్స్' ఉన్నది. అదే అతను యిల్లు వదలి వెళ్ళేందుకు కారణం. కృష్ణ చైతన్య మేధావి. గీత రసాన్వేషి. ఇద్దరూ మనిషిలోని రెండు ప్రవృత్తులకు ప్రతిరూపాలే. నవల చివర యిద్దరూ కలుసుకుం టారు. ఆ కలయికకు కృతార్థత ఉంటుందో లేదో, దాని స్వరూపమేమిటో నిర్ణయం కాకుండానే, గీత హత్యతో నవల ముగుస్తుంది. నవలలోని అన్వేషణకు రచయిత చూపిన పర్యవసానం - మనిషిలోని రసప్రవృత్తి వ్యవస్థవల్ల అంతం చెయ్యబడటం; మేధయొక్క నిస్సహాయత; అర్థంలేని జీవితపు ఏకాంతం మిగలడం. ఇది నిరాశాపూరిత అస్తిత్వవాద దృక్పథం (Pessimistic existentialism) అయినప్పటికీ అన్వేషణలో రసప్రవృత్తి స్వరూ పాన్ని నిర్దుష్టంగా నిర్దిష్టంగా చిత్రించడంలో రచయిత పొందిన కృతార్థత మెచ్చుకోదగింది. ఆ రసప్రవృత్తిని సెక్స్‌లో ప్రేమగా, ఔదార్యంగా, దయగా, అస్తిత్వపు స్వేచ్ఛగా గీతపాత్ర ద్వారా చిత్రించిన తీరు జీవితానుభూతిని గూర్చిన ఒక నూత్న దృక్పథానికి నిండుదనాన్ని యిస్తోంది... 'సంసార వృక్షం'లోని అన్వేషణ అద్వైతానుభూతితో ముగుస్తుంది. ఈ అద్వైతానుభూతి ముక్కుమూసుకుని మూల కూర్చోవడం ద్వారా రాదు! లాయరు యింటి నుంచి పలాయనం కావడం, మళ్ళీ యింటికి తిరిగి రావడం అర్థరహితమైన, పిరికివాని చర్యగా కనిపిస్తుంది లోకం దృష్టికి. వ్యవస్థకు వెలియైన మేధావి, వ్యవస్థకు అతీతుడు కావడం ఎలా జరిగిందో ఆ తత్త్వదర్శనమూ, దానిమూలంగా అతను వ్యవస్థలో తామరాకుమీద నీటిబొ

ట్టులా యిముడడమూ చిత్రించడంలో అనుభూతిపరమైన అద్వైతం ద్యోతకమైంది.

తత్త్వదర్శనానికీ మతానికీ సంబంధం లేదు. మతం వ్యవస్థ. మతమే కాదు, పైనుంచి వచ్చిన ఏ దర్శనశాస్త్రమైనా, దానితో వ్యక్తి అస్తిత్వానికీ అనుభూతికీ ఘర్షణ తప్పదు. తత్త్వానుభూతీ, తత్త్వదర్శనమూ వ్యక్తిగతమైన అన్వేషణ ద్వారానే లభిస్తాయి. అది జీవితానికి దూరంగా ఆశ్రమంలోనో కొండ కోనల్లోనో సాగించే ఆంతరంగిక సాధన కాదు! జీవితాను భూతినుంచీ సామాజిక సంబంధాల నుంచీ ప్రేరణ పొంది, వ్యక్తి చైతన్యాన్నీ, ప్రవర్తననూ ప్రభావితం చేసి, అతనికి పునర్జన్మనూ, వినూత్న దృష్టినీ ప్రసాదించే నిరంతరాన్వేషణ అది. అందువల్ల తత్త్వశాస్త్రానికీ, సూత్రీకరణకూ అందని నైయక్తికానుభూతియొక్క అన్వేషణా మార్గవైశిష్ట్యాన్ని నవలలోనే నిక్షిప్తం చెయ్యడానికి అవకాశం ఉన్నది. ఆ విధంగా అస్తిత్వవాదా నికి తాత్త్విక నవలకూ ఒక అవినాభావ సంబంధం ఉన్నది. అస్తిత్వవాదం నిర్ణీత విశ్వాసాల మీదా, సిద్ధాంతాల చట్రంలోనూ బంధింపబడే ఒక దర్శనం కాదు. జీవితానుభూతియొక్క స్వచ్ఛందమైన అభివ్యక్తినీ అన్వేషణనూ వ్యక్తిలో గుర్తించడమూ, వ్యక్తిగా పొందడమూ అస్తిత్వవాద దృక్పథం.

ఏదో ఒక విశ్వాసం, ఒక ఆశాభావం, ఒక సిద్ధాంతం ద్వారా కాకుండా, అస్తిత్వాన్ని యథాతథంగా దర్శించే సాహసం కలిగిన రచయిత తనుకూడా దార్శనికుడే అవుతున్నాడు. కారణం అస్తిత్వమే సత్యం. అది సత్యానికి బాహ్యరూపం మాత్రమే కాదు. తన్మూలంగా సాహిత్యం దర్శనమౌతున్నది (Literature becomes philosophy).

Existentialism reduces life from what we would like it to be, to what it is; and the instrument employed is not this or that method, but lucidity. The writer who refuses to allow a faith, a hope, or a theory to interfere with his work, who has the courage to confront existence itself, is also a metaphysician because Existence is Reality and not merely its outward form.

(*"Literature considered as Philosophy"* by Everett W. Knight Page 16. Pub: Collier Books, New York, 1962.)

## సవరణ

'మిసిమి' జులై '93 సంచికలో 3వ పేజీలో దేవీప్రసాద్ చటోపాధ్యాయ వ్యాసం ఉపశీర్షిక 'ప్రాచీన భౌతికశాస్త్రము'నకు బదులుగా 'ప్రాచీన భౌతిక వాదము' అని పాఠకులు చదువుకోవాలి.

అదే వ్యాసంలో Dr. K.B. Krishna గారి 'Indian Materialism' అనుటకు బదులుగా 'Hindu Materialism' అని సవరించి చదువుకోవాలి.

సంపాదకుడు
'మిసిమి'

సమీక్ష:

# ప్రేమించడం ఒక కళ

**Art of Loving**
**By ERICH FROMM**

- అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

ఇంతవరకు చెప్పుకొన్న దానిని బట్టి దైవప్రేమను తలిదండ్రుల యెడ ప్రేమ నుంచి విడదీయడానికి వీలులేదని తేలుతుంది. తల్లి, జాతి, తండాకు సంబంధించిన అగమ్యాగమన బంధం (incestuous attachment = పొందరాని పొందుకు సంబంధించిన బంధం) నుంచి విముక్తుడు కాకపోతే, శిక్షించే, మెచ్చుకొనే తండ్రి లేదా అధికారిమీది శైశవాలంబనం నుండి బయట పడకపోతే, అతనిలో పరిణత దైవప్రేమ వికసించదు. దేవుని సర్వరక్షక మాతగా, శిక్షించే - మెచ్చుకొనే తండ్రిగా దర్శించే ప్రాథమిక దశవద్దే అతని మతం ఆగిపోతుంది.

సమకాలీన మతంలో, అన్ని దశలు - అత్యంత ప్రాచీన దశ నుంచి అత్యున్నత దశ వరకు నేటికీ ఉన్నాయి. ''దేవుడు'' అనే పదం ''తెగనాయకుని'' సూచిస్తుంది. అలాగే ''కేవలశూన్యాన్ని'' తెలియజేస్తుంది. అదేవిధంగా, ఫ్రాయిడ్ చెప్పినట్లు, ప్రతి ఒక్కరి అచేతనంలోను నిస్సహాయ శైశవ దశ నుంచి మొదలుకొని అన్ని దశలూ ఉంటాయి. కాని అసలు విషయం ఏమిటంటే అతడు ఎంతవరకు ఎదిగాడనేది. ఒకటి మాత్రం నిజము; దేవుని మీద అతనికి ఉన్న ప్రేమకు మనిషిమీద అతనికి ఉన్న ప్రేమకు స్వభావ రీత్యా సాదృశ్యం ఉంది. అంతేకాక దేవునియందు మానవుని యందు అతనికి ఉన్నప్రేమ వాస్తవ లక్షణం తరచు అచేతనంగా ఉంటుంది. ఈ వాస్తవ లక్షణాన్ని, ప్రేమకు సంబంధించి అతనికి ఉన్న పరిణతాలోచన యుక్తి సహమొనర్చి (rationalise) అణచివేస్తుంది. మనిషిమీద అతనికి ఉన్న ప్రేమ కుటుంబ బంధాలలో పాదుకొని ఉన్నా దాని స్వభావాన్ని అతడు నివసించే సమాజం నిర్ణయిస్తుందని అంతిమ విశ్లేషణం చెబుతుంది. సమాజనిర్మితి అధికారానికి లొంగిపోయేదిగా ఉంటే - బాహ్యాధికారం లేదా అజ్ఞాతంగా ప్రసరించే ప్రజాభిప్రాయాల వ్యాపారాల ప్రభావానికి లోనయ్యేదిగా ఉంటే - దేవునికి సంబంధించిన అతని భావన శైశవంగా ఉంటుంది. అది పరిణతికి ఎంతో దూరము. ఈ పరిణత భావనకు బీజాలు ఏకేశ్వరమత చరిత్రలో గోచరిస్తాయి.

## III. సమకాలీన పాశ్చాత్య సమాజంలో ప్రేమ – దాని విచ్ఛిత్తి

ప్రేమ పరిపక్వతకు, సృజనాత్మకతకు చిహ్నమైతే, ఒక వ్యక్తి ప్రేమ సామర్థ్యాన్ని, అతడు నివసించే సంస్కృతి సగటు మనిషి మీద వేసే ప్రభావం నిర్ణయిస్తుంది. నేటి పాశ్చాత్య సంస్కృతిలో ప్రేమను గురించి చెప్పాలంటే, పాశ్చాత్య నాగరక సమాజ నిర్మాణ, శీలాలు దాని వికాసానికి తగి ఉన్నాయేమో తెలుసుకోవాలి. అసలు ఈ ప్రశ్న ఉదయించడమంటేనే, అలా లేదు అని సమాధానం చెప్పడమవుతుంది. పాశ్చాత్య జీవనాన్ని నిష్పాక్షికంగా పరిశీలించిన వారెవరికైన అందులో ప్రేమ-భాతృ, మాతృ కాముక సంబంధమైనది - బొత్తుగా లేదని, దాని స్థానాన్ని కపట ప్రేమ (Pseudo-love) అనేక రూపాల్లో ఆక్రమించినదని తెలుస్తుంది.

పెట్టుబడిదారీ సమాజం ఒక ప్రక్క రాజకీయ స్వాతంత్ర్యం మీద, మరొక ప్రక్క ''మార్కెట్టు ఆర్థిక సంబంధాలను, వీటిద్వారా సాంఘిక సంబంధాలను అదుపు చేస్తుందనే'' న్యాయంమీద ఆధారపడి ఉంది. మార్కెట్టు వస్తుమారకాన్ని నిర్ణయిస్తుంది. లేబర్ మార్కెట్ శ్రమ క్రయ విక్రయాలను నిర్ణయిస్తుంది. ఉపయోగపడే వస్తువులు, ఉపయోగపడే మానవశక్తి నిపుణతలు - రెండూ బలవంతం, మోసం లేకుండానే వినిమయ వస్తువులుగా విపణి ధర్మాలకు లోబడి మారకం చేయబడుతున్నాయి. చెప్పులు ఉపయోగమే, అవసరమే; అయినా వాటిని అంగడిలో కొనేవాడు లేకపోతే వాటికి ఆర్థిక (మారకపు) విలువ ఉండదు. అంగడిలో కొనేవాడు లేకపోతే మానవశక్తికి, నిపుణతకు గూడ విలువ ఉండదు. పెట్టుబడిదారు శ్రమను కొని, దానితో తన మూలధనాన్ని లాభదాయకమైన పెట్టుబడిగా పనిచేయించగలడు. శ్రామికుడు, ఆకలితో మాడకుండ ఉండాలంటే, తన శ్రమను మార్కెట్టు పరిస్థితులకు లోబడి అమ్ముకోవాలి. ఈ ఆర్థిక నిర్మితి ఒక విలువల నిశ్రేణిలో ప్రతిఫలిస్తుంది. పెట్టుబడి శ్రమను ఆదేశిస్తుంది. కూడబెట్టబడిన ప్రాణంలేని వస్తువులు సజీవ మానవ శక్తుల కన్న విలువైనవి అయ్యాయి.

పెట్టుబడీదారీ వ్యవస్థ మూలనిర్మాణం మొదటి నుంచి గూడ ఇలాగే ఉంది. కాని ఆధునిక పెట్టుబడీదారి విధాన లక్షణం ఇప్పటికీ అదే అయినప్పటికి, దీని విశిష్ట లక్షణాలను సమకూర్చినటువంటి, ఆధునిక మానవుని శీలాన్ని విపరీతంగా ప్రభావితం చేసినటువంటి అనేక కారకాలు మారిపోయాయి. పెట్టుబడిదారి వ్యవస్థ అభివృద్ధి చెందే కొలది మూలధనం ఒక చోటకు పోగు అవుతుంది. పెద్దపెద్ద వ్యాపారాలు నిరంతరం పెరిగిపోయి, చిన్నవి నలిగి నశించిపోతాయి. ఈ పెద్ద వ్యాపారాలలో పెట్టుబడి పెట్టిన సొంతదారు ఆ వ్యాపార అజమాయిషీ (పెత్తనం) నుంచి దూరమవుతాడు. వేలకొలది స్టాకుహోల్డర్లే ఏ వ్యాపారానికైన అసలు పెట్టుబడిదారులు. కాని ఆ వ్యాపారాన్ని ఈ స్టాకు హోల్డర్లు కాక ఒక అజమాయిషీవర్గం (పెత్తందారీ వర్గం - Bureaucracy) నిర్వహిస్తుంది. ఈ అజమాయిషీ వర్గం మంచి జీతాలు పుచ్చుకొంటుంది. దీనికి వ్యాపారాన్ని విస్తృతం చేయాలని, దానిపై తన ఆధిపత్యాన్ని స్థిరపరచుకోవాలని కోర్కె ఉంటుందే తప్ప అధిక లాభాలమీద దృష్టి ఉండదు. మూలధనం కేంద్రీకృతం కావడం, బలమైన అజమాయిషీ వర్గం (పెత్తందారీ వర్గం) ఏర్పడడంతో వీటికి సమానాంతరంగా శ్రామికోద్యమం తలెత్తుతుంది. శ్రామికశక్తి ఏకీకరణంతో, వ్యక్తిగతంగా ఏ శ్రామికుడు తన శ్రమశక్తిని అమ్ముకోవడానికిగాని, తనకుతానే బేరం కుదుర్చుకోవడానికి గాని వీలు లేదు; అతడు పెద్ద లేబరు యూనియన్‌లో సభ్యుడయ్యాడు. అతని తరపున ఒక బలమైన అజమాయిషీ వర్గం (లేబర్ యూనియన్ నాయకత్వం) పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి సంప్రదింపులలో ప్రాతినిధ్యం వహిస్తుంది. మంచికో చెడుకో తెలియదుకాని, పెట్టుబడి, శ్రామిక రంగాలలో ఏది ప్రారంభించాలన్నా (ఉపక్రమించాలన్నా) అజమాయిషీ వర్గం చేయవలసిందే తప్ప వ్యక్తి చేయడానికి వీలులేదు. అధిక సంఖ్యలో ప్రజలు స్వాతంత్ర్యాన్ని కోల్పోయి ఆర్థిక మహాసామ్రాజ్యాల పెత్తందారీ ప్రభువుల మీద ఆధారపడుతున్నారు.

మూలధనం కేంద్రీకృతం కావడం వల్ల ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ సంతరించుకొన్న మరొక లక్షణం పనిని క్రమబద్ధం చేసే విధానంలో ఉంది. శ్రమ విభజనతో గూడిన కేంద్రీకృత వ్యాపారాలు ఒక రకమైన శ్రామిక విధానానికి దారితీశాయి. ఈ విధానంలో వ్యక్తి తన

వ్యక్తిత్వాన్ని పోగొట్టుకొంటాడు; యంత్రంలో అరిగిపోయే (త్యాగం చేస్తున్న) చక్రం పన్ను అవుతాడు. ఆధునిక పెట్టుబడిదారీ విధానంలోని మానవ సమస్యను ఈవిధంగా చెప్పవచ్చు.

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థకు సాఫీగ సహకరించే మనుష్యులు కావాలి. వారు పెద్దసంఖ్యలో కావాలి. ఎక్కువ ఎక్కువగ వినిమయం చేసుకొనే వారుగ వారుండాలి. వారి అభిరుచులు ప్రామాణికాలై, ఊహించడానికి వీలైనవిగా ఉండాలి. అవి ప్రభావితం చేయడానికి వీలైనవై ఉండాలి. వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలుండాలి. వారు ఏ అధికారానికి, ధర్మానికి, అంతరాత్మ ప్రబోధానికి లోబడి ఉండరాదు. అయినా వారు మాత్రం వారి నుంచి ఆశించబడిన దానిని చేసేట్టుగా ఉండాలి. సాంఘిక యంత్రంలో మెరమెరలు లేకుండ ఇమిడిపోవడానికి, ఆజ్ఞలు పాలించడానికి సంసిద్ధులై ఉండాలి. ఒక్క మంచి చేసే విషయంలో, దేనికైన సిద్ధంగా ఉండే విషయంలో, నిర్వహించడంలో, ముందుకు పోవడంలో తప్ప నాయకులు లేకుండ నడిపించబడే ప్రజలు, బలాత్కారం లేకుండ పాటించే ప్రజలు, లక్ష్యం లేకుండ ప్రరోచితు (Prompt) లయ్యే ప్రజలు కావాలి.

అయితే దీని పర్యవసానమేమిటి? ఆధునిక మానవుడు తనకు, తోటివారికి, ప్రకృతికి దూరమయ్యాడు. అతడు క్రయవస్తువు (Commodity) గా మారిపోయాడు. ఉన్న మార్కెట్టు పరిస్థితులను బట్టి అధిక లాభాన్ని ఆర్జించిపెట్టే పెట్టుబడిగా తన జీవన శక్తులను (life forces) పరిగణిస్తున్నాడు. మనస్సు, వాక్కు, కర్మలలో వ్యక్తికి వ్యక్తికీ, తేడా లేకుండా, భద్రత కోసం సమూహానికి సన్నిహితంగా ప్రతి ఒక్కరు ఉండడంతో మానవ సంబంధాలు, ముఖ్యంగా, స్వయంచలన యంత్ర భాగాల మధ్య సంబంధాలవలె వైమనస్యమై పోయాయి. ప్రతి ఒక్కరు తక్కిన వారితో వీలైనంత సన్నిహితంగా ఉండడానికి ప్రయత్నిస్తుండగా, మానవ ఏకాకిత్వాన్ని (Human separateness) అధిగమించలేని కారణాన ఏర్పడిన అభద్రత (unsecurity), వ్యాకులత (anxiety), అపరాధ భావన (guilt) లతో పూర్తి ఒంటరివారై పోతున్నారు. మన నాగరికత ఈ ఒంటరితనాన్ని తెలియరానీయకుండ కొన్ని ఉపశాంతులను కలుగచేస్తుంది. అన్నిటికంటె ముందర క్రమంతప్పని, యాంత్రికమైన, బ్యూరోక్రటిక్ దినచర్య. పైకిపోవాలి, సాయుజ్యం చెందాలి అనే తీవ్ర వాంఛలను గుర్తించనీయ కుండ ఈ దినచర్య నిరోధిస్తుంది. ఈ దినచర్య ఒక్కటే ఆ పని చేయలేకపోతే అచేతన నిస్పృహ (unconscious despair)ను దైనిక వినోదం (routne amusement) ద్వారా, ఆ వినోదం అందించే శబ్దాలను, దృశ్యాలను నిష్క్రియాత్మకంగా అనుభవించడం ద్వారా పారదోలుతాడు. ఎప్పుడూ కొత్త వస్తువులను కొనడం ద్వారా, వాటిని ఇతర వస్తువులకు మారకం వేయడం ద్వారా అచేతన నిస్పృహను అధిగమిస్తాడు. ఆధునిక మానవుడు హక్స్లే ''బ్రేవ్ న్యూ వరల్డ్''లో వర్ణించిన మానవునికి దగ్గరగ ఉన్నాడు; ఇందులో మనిషికి పుష్టిగా భోజనం, మంచి దుస్తులు, లైంగిక తృప్తి అన్నీ ఉంటాయి, కాని ఆత్మ ఉండదు. తోటివారితో పైపై సంబంధాలు తప్ప లోతైన సంబంధాలు ఉండవు. హక్స్లే సంక్షేపంగా చెప్పిన ''వ్యక్తి అనుభూతిలో కదిలినప్పుడెల్ల సమాజం మొత్తం తూగుతుంది'', లేదా ''ఈరోజు అనుభవిం పదగిన వినోదక్రీడ (fun - గమ్మత్తు) లేనైన వుంటే రేపటికి వాయిదా వేయకు,'' వంటి నినాదాలతో, ''ఈ రోజుల్లో ప్రతివాడు సుఖంగానే ఉన్నాడు,'' అనే మకుటాయమాన వాక్యాలతో ఆధునిక మానవుడు కొట్టుకుపోతున్నాడు. ఇవ్వాళ మానవుని సంతోషం ''వినోదక్రీడ''లో ఉంది. ఈ వినోదం అనేది వినిమయంలో, క్రయంలో, ఆహారాన్ని,

పానీయాలను, సిగరెట్లను, జనాన్ని, ఉపన్యాసాలను, పుస్తకాలను, సినిమాలను లోగొనడంలో ఉంది - అన్నిటిని వినిమయం చేసుకోవడంలో ఉంది, మింగివేయడంలో ఉంది. ఈ ప్రపంచం మన ఆకలిని తీర్చే ఒక పెద్ద వస్తువు, ఒక పెద్ద ఆపిల్ పండు, ఒక పెద్ద సీసా, ఒక పెద్ద పయోధరము; మనం నిరంతరం ఆశాపాశాలలో ఎదురుచూచే లేగలం, నిరంతరం నిరాశ చెందే పాపలము. మన ప్రవర్తన అంతా మారకం చేయడానికి, గ్రహించడానికి, వస్తుమార్పిడికి, వినిమయానికి సమాయత్తమై ఉంది. ఆధ్యాత్మిక, భౌతిక వస్తువులన్నీ గూడ మారకపు వస్తువులు, వినిమయ వస్తువులు అయ్యాయి.

ప్రేమకు సంబంధించినంతవరకు, అవసరం కొలది, ఈ పరిస్థితి అంతా ఆధునిక మానవుని నడతకు సరిపోతుంది. స్వయం చలన యంత్రాలు ప్రేమించుకోలేవు. అవి (వారు) తమ ''మూర్తిమత్వ మంజూషిక'' (Personality Package) లను మారకం వేసుకోగలవు (రు); లాభసాటి బేరం కోసం ఎదురుచూస్తారు. ''జోడు కలవడం'' ''కాడి కలవడం'' (team) అనే భావం ప్రేమను, ముఖ్యంగా వైమనస్యంతో గూడిన వివాహాన్ని అర్థవంతంగా వ్యక్తం చేస్తుంది. సుఖ దాంపత్యాన్ని గురించి ఎన్నో వ్యాసాలు వెలువడ్డాయి. ఈ వ్యాసాలన్నీ మెరమెరలు లేకుండా సాగిపోయే జంటను ఆదర్శంగా గ్రహించాయి. ఈ ఆదర్శం ''సాఫీగా పనిచేసే ఉద్యోగి'' భావనకు భిన్నం కాదు: అతడు ''తగు మాత్రం స్వతంత్రుడు''గా ఉండాలి; సహకారిగా సహనశీలిగా ఉండాలి. అదే సమయంలో ఆశాపరుడుగ, కలహకారకుడుగ ఉండాలి. దాంపత్య జీవితాన్ని సరిదిద్దే సలహాదారు, భర్త భార్యను అర్థం చేసుకొని, సహకారిగా ఉండాలని, మనకు చెబుతాడు. ఆమె వేసుకొన్న కొత్త బట్టలను, ఆమె చేసిన రుచికరమైన వంటకాన్ని భర్త మెచ్చు :ాలంటాడు. భర్త విసిగి వేసారి ఇంటికి వచ్చి వ్యాపారం చిక్కులను ఏకరువు పెడుతుంటే, ఆమె సానుభూతితో శ్రద్ధతో ఆలకించాలి. ఆమె పుట్టిన రోజును అతడు మరచిపోతే ఆమె కోపగించుకోక అతనిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఇదంతా గూడ, జీవితాంతం ఒకరికొకరు కొత్తవారుగానే మిగిలిపోతో, ఎప్పటికీ ''కీలక సంబంధాన్ని'' (Central relationship) చేరుకోలేని, పరస్పరం మన్నన లను నెరవుకొంటూ, సుఖపెట్టాలని ప్రయత్నించే ఇద్దరి మధ్య బాగా కందెన వేసిన సంబంధం కంటె అన్యం కాదు. ఈ రకమైన ప్రేమ, పెండ్లి భావనలో ఉన్న ముఖ్య విషయం ఇతరంగా భరించలేని ఒంటరితనం నుంచి, నీడ దొరుకుతుంది. ప్రపంచానికి పోటీగ అతడు మరొక రితో బంధుత్వం ఏర్పరచుకొంటాడు. ఈ అహంకారాన్ని (egoism), ద్వంద్వతను, ప్రేమ అని, స్నేహమని, భ్రమ పడతారు.

సమష్టిభావం (Team spirit), పరస్పర సహనం మొదలైన వాటికి ప్రాముఖ్యత నివ్వడం ఈ మధ్యే మొదలైంది. దీనికిముందు, మొదటి ప్రపంచ మహా సంగ్రామం తరవాత కాలంలో సంతృప్తికరమైన ప్రేమ సంబంధాలకు, ముఖ్యంగా సుఖదాంపత్యానికి, మూలం పరస్పర లైంగిక తృప్తిలో ఉందని భావించారు. దాంపత్యంలో తరచు కలిగే అసంతృప్తికి కారణం దంపతులు సరిగా ''లైంగికమైన సర్దుబాటు'' (Sexual adjustmen) చేసుకోలేక పోవడంలో ఉందని భావించారు. ఇలా చేసుకోలేకపోవడానికి కారణం ''సరైన'' లైంగిక విజ్ఞానం లేనందు వల్ల దంపతులలో ఒకరుగాని, ఇద్దరూ గాని తప్పుడు లైంగిక విధానాన్ని అవలంబించడము. ఈ తప్పును సరిచేయడానికి, పరస్పరం ప్రేమించుకోలేని దురదృష్టవంతులైన ఆ దంపతులకు సహాయపడడానికి, అనేక గ్రంథాలు, సరైన లైంగిక పద్ధతిమీద సలహాలు ఇచ్చాయి.

బాహ్యంగాగాని, ఆంతరంగికంగా గాని, ప్రేమ, సంతోషాలు తప్పకుండ కలుగుతాయని మాటిచ్చాయి. ప్రేమ లైంగికానందం నుంచి పుడుతుందని, ఇద్దరు వ్యక్తులు కనుక లైంగికంగా పరస్పరం తృప్తిపరుచకోగలిగితే, వారు ప్రేమించుకొంటారని దీని అంతరార్థము. ఇది, ఆ కాలంలో, సామాన్య జనంలో ఉన్న భ్రమకు తగినట్లుగానే ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి సంబంధమైన సాంకేతిక సమస్యలలోనే కాక, మానవ సమస్యలన్నింటిలో గూడ, సరైన పద్ధతిని (right technique) ఉపయోగిస్తే చాలు. పరిష్కారం దానంతటదే లభిస్తుందనే భ్రమలో ఉండేవారు. కాని అసలు వాస్తవం దీనికి వ్యతిరేకమనే విషయాన్ని వారు విస్మరించారు.

ప్రేమ లైంగిక తృప్తివల్ల జనించదు. కాని లైంగికానందం - లైంగిక విధానానికి సంబంధించిన జ్ఞానంతో సహా - ప్రేమ ఫలితము. దీనిని నిత్య జీవితంలోకాక వేరేగా ఋజువు చేయాలంటే, అటువంటి ఋజువు మనకు మనోవిశ్లేషణ సాహిత్యంలో కనిపిస్తుంది. ఎక్కువగా ఎదురయ్యే లైంగిక సమస్యలను - స్త్రీలలో జడత్వం, కొంచెం ఇంచుమించుగా పురుషులలో కనిపించే మనోషండత్వం (సెక్స్ మానసికము) - పరిశీలిస్తే, కారణం సరైన పద్ధతి తెలియక పోవడంలో లేదని ప్రేమను అసంభవం చేసే ప్రత్యాదేశం (Inhibition) లో ఉందని తేలుతుంది. స్త్రీ అంటే పురుషునికి, పురుషుడంటే స్త్రీకి ఉన్న భయం, ద్వేషాలు ఈ చిక్కులకు మూలము. ఈ భయ, ద్వేషాలున్న వ్యక్తి తనను తాను అర్పించుకోలేడు. ఖచ్చితంగా ఏ పనీ చేయలేడు. శారీరకంగా తనతో పెనవేసుకొని, అవ్యవధిగ, ప్రత్యక్షంగా ఉన్న లైంగిక భాగస్వామిని విశ్వసించలేడు. లైంగికంగా ప్రత్యాదేశితుడైన వ్యక్తి భయం లేదా ద్వేషం నుంచి విముక్తి పొందగలిగి, అలా జరగడం వల్ల ప్రేమించగలిగితే అతని లేదా ఆమె లైంగిక సమస్యలు పరిష్కారమైనట్లే. లేకపోతే లైంగిక పద్ధతిని గురించి ఎంత జ్ఞానం ఉన్నా అది నిరుపయోగము.

లైంగిక విధాన విజ్ఞానము లైంగికానందానికి, ప్రేమకు దారితీస్తుందనేది ఒట్టి భ్రమేనని మనోవిశ్లేషణ సూచించినా, పరస్పర లైంగిక తృప్తి ననుసరించి ప్రేమ ఏర్పడుతున్న మూలభావం చాలవరకు ఫ్రాయిడ్ సిద్ధాంతాలవల్ల ప్రభావితమైంది. ఫ్రాయిడ్ కు ప్రేమ మౌలికంగా లైంగిక విషయము. ''మానవుడు, అనుభవం ద్వారా, అన్ని సంతోషాలకు అదే ఆదర్శమా అన్నట్లు, లైంగిక (జననాంగ) ప్రేమ అత్యంత సంతృప్తిని ఇచ్చిందని గ్రహించి నందువల్ల, జననాంగ కామాభివ్యక్తీకరణాన్ని (genital eroticism) అతని జీవిత లక్ష్యం చేయడానికి, ఇంకా అదే సదృశ ప్రేమానుభవం, ఫ్రాయిడ్ దృష్టిలో, కామవాంఛాఫలము అయితే ఇది ''ప్రత్యాదేశిత లక్ష్యం'' (Inihibited aim) ప్రచోదనంగా మారిన లైంగిక సహజాతము (లక్ష్యం మార్చుకొన్న లైంగిక సహజాతము). ప్రత్యాదేశిత లక్ష్యం ఉన్న ప్రేమ, నిజంగా, మొదట్లో పూర్తిగ విషయ వాసనాపూరితమైంది. ఇప్పటికి మానవుని అచేతనంలో అలాగే ఉంది. ''సాయుజ్యానికి, మరొకనితో లేదా తోడివారితో తీవ్రంగా కలిసిపోయినప్పటి అనుభూతికి మూలమైన, మార్మికానుభవసారమైన (essence of mystic experience) ఏకతానుభూతికి (అనంతానుభూతికి - Oceanic feeling) సంబంధించినంతవరకు, దీనిని, ఫ్రాయిడ్ రోగగ్రస్త విషయంగా శైశవ ''అనంత స్వానురాగానికి'' (limitless nacissism) ప్రతీపగమనం (regression) గా అభివర్ణించాడు.

ఫ్రాయిడ్ దృష్టిలో, ప్రేమ గుడ్డిది (irrational) అనే దానికి, ఇది ఒక అడుగు ముందు. అతని దృష్టిలో అంధప్రేమ (irrational love) కు, పరిణత ప్రేమకు మధ్య తేడా లేదు. అతడు ''ప్రేమ బదిలీ'' (transference of love) పై వ్రాసిన వ్యాసంలో, మామూలు

ప్రేమకు, బదిలీ అయిన ప్రేమకు ముఖ్య లక్షణాలలో తేడా లేదన్నాడు. ప్రేమలో పడడం అది అసామాన్యతకు (abnormal) అంచున ఉంటుంది. దీనిలో వాస్తవాన్ని చూడక పోవడం ఉంటుంది. ఒత్తిడి ఉంటుంది. ఇది శైశవ ప్రేమ వస్తువునుంచి బదిలీ అవుతుంది. వివేచనాత్మక ప్రేమ పరిణతికి పరాకాష్ఠ అనే విషయం ఫ్రాయిడ్ కు పరిశోధన విషయం కాదు. ఎందుకంటె అది వాస్తవం కాదు.

''లైంగిక ఆకర్షణ ఫలితం ప్రేమ'' లేదా ''లైంగికతృప్తే ప్రేమ'' అనే భావనలమీద ఫ్రాయిడ్ ప్రభావాన్ని అతిగా అంచనా వేయడం పొరపాటే అవుతుంది. ముఖ్యంగా కారణాల గొలుసుకట్టు కోసం వెదికితే అది మరొక ప్రక్క నుంచి వస్తుంది. ఫ్రాయిడ్ భావాలు గూడ కొంతవరకు పందొమ్మిదవ శతాబ్ది తత్త్వంతో ప్రభావితమయ్యాయి; కొంతమేరకు వాటిని మొదటి ప్రపంచ మహాసంగ్రామానంతర తత్త్వం ప్రాచుర్యంలోకి తెచ్చింది. ''విక్టోరియా యుగ నీతి'' అంటే ఉన్న వ్యతిరేకత అటు ప్రజా బాహుళ్య భావాలను, ఇటు ఫ్రాయిడ్ భావాలనుగూడ ప్రభావితం చేసింది. ఫ్రాయిడ్ భావాలను ప్రభావితం చేసిన రెండవ కారకం అప్పట్లో మానవుడంటే ఉన్న భావన (concept of man). ఈ భావన పెట్టుబడిదారీ వ్యవస్థమీద ఆధారపడి ఉంది. మానవుని సహజావసరాలకు పెట్టుబడిదారీ విధానం అనుగుణంగా ఉన్నదని చూపించాలంటే మనుష్యులు సహజంగా పోటీ మనస్తత్వం గలవారని, పరస్పర ద్వేష పూరితులని, ఋజువు చేయాలి. ''ఆర్థిక లాభంమీద మానవునికున్న తృప్తిలేని ఆశలో'' ఆర్థికవేత్తలు, ''సమర్థవంతమైన జీవులు అతి జీవిస్తాయి'' అనే న్యాయంలో డార్విన్‌వాదులు; దానిని దర్శించగా, అదే పర్యవసానాన్ని ఫ్రాయిడ్ ''స్త్రీలనందరిని లైంగికంగా జయించాలనే అనంతమైన ఆశ మగవానికి ఉన్నదని, ఈ ఆశను అతడు ఆచరణలో పెట్టకుండ సమాజం అడ్డుకొంటుంది,'' అనే సిద్ధాంతంలో దర్శించాడు. ఫలితంగా మానవులు అవసరంగా అసూయాపరులవుతారు, పోటీకి అవశ్యకమైన సామాజిక, ఆర్థిక కారణాలు అంతరించిన తరవాత గూడ అది మాత్రం మిగిలిపోతుంది.

అంతిమంగా ఫ్రాయిడ్ ఆలోచనను ప్రభావితం చేసింది పందొమ్మిదో శతాబ్దంలో ప్రబలంగా ఉన్న భౌతికవాదము. మానసిక విషయాలన్నింటికి మూలాన్ని శరీర ధర్మాలలో చూడాలని ప్రతిఒక్కరు విశ్వసించారు. అందుకని ప్రేమ, ద్వేషం, ఆశ, అసూయలను ఫ్రాయిడ్ లైంగిక సహజాతం నుంచి అనేక రూపాలతో వచ్చిన ఫలితాలుగ వివరించాడు. మౌలికసత్యం మొత్తం మానవసత్తా (total human existance) లో ఉన్నదని, అన్నిటికంటె ముందు మానవులందరికి సామాన్యమైన మానవ స్థితి (Human situation) లో ఉన్నదని, ఆ తరువాత ప్రత్యేక సమాజ స్థితి నిర్ణయించిన జీవనాచరణలో ఉంటుందని అతడు కానలేక పోయాడు. (ఈరకం భౌతిక వాదానికి వెలుపలగ కాలిడిన వాడు మార్క్స్, అతడు రచించిన ''చారిత్రక భౌతికవాదం''లో! ''మానవ రహస్యం'' ఆహారం లేదా ఇతర అవసరాలకు సంబంధించిన అతని సహజాతాలలో లేదని, ''కీలకం'' అతని యావజ్జీవిత ప్రక్రియ (total life process) లో, అతని జీవితాచరణం (Practice of life) లో ఉన్నదని చెప్పాడు). ఫ్రాయిడ్ ప్రకారం, సహజాతవాంఛలు ప్రత్యాదేశితాలు కాకుండ తీరితే మానసికస్వాస్థ్యం, సంతోషం సమకూరుతాయి. కాని మనకు తెలిసిన చికిత్సానుభవాలు, విశృంఖల లైంగికతకు అంకితమైన మగవారు - ఆడవారు - సుఖాన్ని పొందలేరని, తరచు తీవ్రనాడీ రుగ్మతలకు గురవుతారని ఋజువు చేస్తున్నాయి. సహజాతావసరాలు (instinctual needs) పూర్తిగా తీరడమనేది

సంతోషానికిమూలం  కాకపోవడమే కాక, బుద్ధి స్థిరత్వానికి గూడ పూచీపడదు. మొదటి ప్రపంచ సంగ్రామానంతరం పెట్టుబడిదారీ వ్యవస్థ ఒరవడిలో జరిగిన మార్పుల వల్లనే అంటే కూడబెట్టడం మొదలుకొని వ్యయం చేయడం వరకు, ఆర్థిక లాభంకోసం ఆత్మను చంపుకొన్న దగ్గర నుంచి మార్కెట్టు నిరంతరం పెరగడానికి వినిమయం మూలం అన్నవరకు, వ్యాకులుడైన స్వయంచాలిత యంత్రమైన వ్యక్తితృప్తికి ఈ వినిమయమే మూలమన్నంతవరకు ఫ్రాయిడ్  భావం అంతప్రాచుర్యం పొందగలిగింది. కోర్కెలను తీర్చుకోవడం వాయిదా వేయరాదన్నది లైంగికరంగానికే కాక, ఇతర భౌతిక విషయాలకూ ముఖ్య లక్ష్యమైపోయింది.

ఈ శతాబ్ది మొదట్లో, అప్పుడున్న పెట్టుబడిదారీ వ్యవస్థ తత్త్వానికి అనుగుణంగా అవిచ్ఛిన్నంగా వస్తున్న ఫ్రాయిడ్  సిద్ధాంతాలను, అత్యంత ప్రతిభావంతుడు, సమకాలీనుడు అయిన కే.శే. ఎచ్.యస్. సలివాన్ సిద్ధాంతాలతో పోల్చడం ఆసక్తికరంగా ఉంటుంది. ఫ్రాయిడ్ కు భిన్నంగా, సలివాన్ మనోవిశ్లేషణ విధానంలో లైంగికతకు, ప్రేమకు మధ్య సరిహద్దు రేఖను స్పష్టంగా గీశాడు.

సలివాన్ భావనలో ప్రేమ, సాన్నిహిత్యం (intimacy) - ఈ రెండింటికి అర్థం ఏమిటి? ''సాన్నిహిత్యమంటే వ్యక్తిగత యోగ్యతల (personal worth) యొక్క నిర్మాణకాల ప్రమాణీకరణాన్ని అనుమతించే ఇద్దరు వ్యక్తులతో గూడిన సన్నివేశము. వ్యక్తిగత యోగ్యతల నిరూపణకు ఒక రకమైన సంబంధం కావాలి. ఈ సంబంధాన్ని నేను తోడ్పాటు (collaboration) అంటాను. తోడ్పాటు అంటే సదృశ పరస్పర తృప్తులను అంటే ఒకరినొకరు సంతృప్తిని కలిగించడం ఒకరికొకరు రక్షించుకోవడం లాంటి అవసరాలను తీర్చుకోవడం కోసం అవతలి వ్యక్తి ప్రవర్తనకు అనుగుణంగా తన ప్రవర్తనను స్పష్టమైన నియమాల ద్వారా మలుచుకోవడము''. సలివాన్ నిర్వచనాన్ని అతడు ఉపయోగించిన చిక్కుభాషనుంచి విడగొడితే తోడ్పాటు సన్నివేశంలో మనం ప్రేమసారాన్ని దర్శిస్తాము. ఈ సన్నివేశం లోని ఇద్దరు వ్యక్తులు ఇలా అనుభూతి చెందుతారు: ''మా ప్రతిష్ఠను గొప్పతనాన్ని, అర్హతలను ఇనుమడింపజేసుకోడానికి నిబంధనల ప్రకారమే ఆట అడతాము'' పందొమ్మిదవ శతాబ్ది పెట్టుబడిదారీ - పితృస్వామ్య వ్యవస్థ గత పురుషుని అనుభవంగా ప్రేమను ఫ్రాయిడ్  సిద్ధాంతం చెప్పినట్లే, సలివాన్ గూడ ప్రేమకు ఇరవై శతాబ్ది వైమనస్య క్రయ విక్రయ మూర్తిమత్వాల అనుభవంగా వర్ణిస్తాడు. అది తమ సదృశ అవసరాలను ఏకం చేసుకొని వైమనస్య ప్రపంచానికి ఎదురుగా నిలిచే ఇద్దరు వ్యక్తుల ద్వంద్వ అహంకారము (egotism a deux = ఇద్దరి అహంకారము). ''తమ సదృశ ఆశయ సాధనలో అవతలి వ్యక్తి వ్యక్తీకరించిన అవసరాలకు అనుగుణంగా ప్రవర్తన మలచుకొనే'' ఏ జంట (ఇద్దరి) అనుభవానికైన, సాన్నిహిత్యానికైన (intimacy) ఇతడు ఇచ్చిన నిర్వచనం సరిపోతుంది. అలాంటప్పుడు వ్యక్తి అవసరాల (expreessed needs) ను గురించి మాట్లాడడం విశేషమే. ఒకడు ప్రేమను గరించి అతి తక్కువగ చెప్పగలిగిందల్లా ఇద్దరి వ్యక్తుల మధ్య అవ్యక్త అవసరాల (unexpressed needs)కు అందులో ప్రతికారం (Reaction) ఉన్నదని, ఆధునిక పాశ్చాత్య సమాజంలో ప్రేమను పరస్పర లైంగిక తృప్తిగ ఎంచడం, దానిని ''సమష్టికార్యం'' (team work - జంట కార్యం)గ, ఒంటరితనం నుంచి ఆశ్రయంగ పరిగణించం - ఈ రెండు ప్రేమవిచ్ఛిత్తికి రెండు ''సామాన్య'' రూపాలు. ఇవి సామాజిక నిర్మితి కారణంగా ఏర్పడిన ప్రేమ రుగ్మతలు. (సశేషం)

Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717




Photo: Witt Library/Courtauld Institute of Art

William Orpen/Life Study

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191

## ''అన్ని బ్యాంకులకన్నా వడ్డీ మిన్న ఆప్కాబ్ అందించే పొదుపు పథకాలలో''

## 46 రోజులకు 11.25%

కాలపరిమితి ధరావతులపై ఆప్కాబ్ అందిస్తున్న వడ్డీరేట్లు
(01-3-1993 నుంచి అమలులో)

| కాలపరిమితి | వడ్డీరేటు |
|---|---|
| ★ 46 రోజుల నుండి 270 రోజుల వరకు | 11.25 |
| ★ 271 రోజుల నుండి 1 సం. లోపు | 11.00 |
| ★ ఒక సంవత్సరము ఆపైన | 11.25 |
| సేవింగ్స్ బ్యాంక్ ఖాతా | 6.25% |

ఆప్కాబ్‌లో ఉన్నాయి పెట్టుబడికి, పొదుపుకు అనేక పథకాలు. ★ గృహలక్ష్మి డిపాజిట్ స్కీమ్ ★ స్వర్ణఫల డిపాజిట్ స్కీమ్ ★ మారేజి డిపాజిట్ స్కీమ్ ★ హయ్యర్ ఎడ్యుకేషన్ డిపాజిట్ స్కీమ్ ★ క్యాష్ సర్టిఫికెట్ స్కీమ్ ★ బాలసహాయ డిపాజిట్ స్కీమ్ ★ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ★ పెన్షన్ డిపాజిట్ స్కీమ్ సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్ ★ ఎన్.ఆర్.ఐ. (రు) మరియు ★ హోమ్‌లోన్ అక్కౌంట్.

APCOB

**ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి॥.**

(షెడ్యూల్డ్ బ్యాంకు)
ట్రూప్ బజార్, హైదరాబాదు
ఫోన్: 44481, 44482, 44483

బ్రాంచీలు: విద్యానగర్ 615192 ★ మలక్‌పేట్ 528983 ★ నారాయణగూడ 664909 ★ విద్యుత్ సౌధ 220378 ★ సికింద్రాబాద్ 76172 ★ సైదాబాద్ కాలనీ 877401 ★ బౌద్ధనగర్ 865518 ★ హిమాయత్ నగర్ 232837 ★ తార్నాక 869351 ★ మాసాబ్‌టాంక్ 225451 ★ దిల్‌సుక్‌నగర్ 875539 ★ చార్మినార్ 524161 ★ బాగ్‌లింగంపల్లి 668944 ★ లోతుకుంట 845527 ★ తార్నాక బ్రాంచ్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ (ఎపిడిడిసియస్ ఆవరణలో) 869308 ★ తిరుపతి 22428.

**సదా మీ క్షేమాన్ని కాంక్షించే బ్యాంక్ ఆప్కాబ్**

(భారతీయ రిజర్వు బ్యాంకు వారి ఆదేశాల మేరకు అన్ని రేట్లు రివిజన్‌కు లోబడి ఉంటాయి.)